యువత సన్మార్గంలో నడవాలి



చిన్నారుల నృత్య ప్రదర్శన

పుట్టపర్తి, న్యూస్‌టుడే: యువత సన్మార్గంలో నడిచి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలనే సందేశాన్ని చిన్నారులు నృత్యరూపంలో తెలియజేశారు. గురువారం సాయికుల్వంత్ మందిరంలో అనకాపల్లి బాలవికాస్ చిన్నారులు 'సాయిపథంలో సన్మార్గ పరివర్తనం' నృత్య నాటికను ప్రదర్శించారు. నేటి సమాజంలో యువత వ్యసనాలకు అలవాటు పడుతున్నారని, మానవతా విలువలు పాటించి, సన్మార్గంలో పయనించాలని సూచించారు. సత్యసాయి ప్రపంచ మానవాళికి అందించిన ఆధ్యాత్మిక బోధనలు, సేవా మార్గం, ప్రేమతత్వం అలవర్చుకోవాలనే సందేశాన్ని వివరించారు. సత్యసాయి కీర్తిస్తూ సంగీతగాన కచేరి అద్భుతంగా నిర్వహించారు. సత్యసాయి భక్తి గీతాలను శ్రావ్యంగా ఆలపించారు. ప్రశాంతి నిలయంలో ప్రపంచశాంతిని కాంక్షిస్తూ సత్యసాయి సామూహిక ప్రతులు నిర్వహించారు.



దారి కోత.. కారాదు గుండెకోత



కనగానపల్లి మండల కేంద్రం సమీపంలో చెరువు తెగి పర్చిన వరద ఉద్ధృతికి రహదారి కోతకు గురైంది. ధర్మవరం-కళ్యాణదుర్గం రహదారి నుంచి మండల కేంద్రానికి వెళ్లే రహదారిలో 4 చోట్ల రహదారి పక్కన మట్టి కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారింది. నిత్యం ఈ రహదారిలో రాకపోకలు అధికంగా ఉండటంతో వీలైనంత త్వరగా మరమ్మతులు చేయిస్తేనే ప్రమాదాలకు ఆస్కారం ఉండదు - ఈనాడు, అనంతపురం, న్యూస్‌టుడే, కనగానపల్లి

కంటిచూపు తగ్గుతోంది!

ఉమ్మడి జిల్లాలో విద్యార్థులకు పరీక్షలు

అనంతపురం (వైద్యం), న్యూస్‌టుడే

సర్వేంద్రియానం నయనం ప్రధానం.. జీవన గమనంలో నేత్ర ప్రాధాన్యం తెలియంది కాదు. వయసు మీద పడ్డాక సమస్యలు వస్తాయనుకుంటే పొరపాటే. ప్రస్తుత పరిస్థితుల్లో వయసుతో సంబంధం లేకుండా సమస్యలు తలెత్తుతున్నాయి. చిన్నారుల్లో దృష్టిలోపాలు అధికమవుతుండటంతో ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం దృష్టిలోపం ఉన్న విద్యార్థులను గుర్తించి.. అద్దాలను ఉచితంగా అందజేయటం, అవసరమైన వారికి శస్త్రచికిత్స చేయించాలని నిర్ణయించింది. ఈమేరకు ఈ ఏడాది ఆగస్టు నుంచి 'స్కూల్ ఆఫ్ హెల్త్ ఐ స్క్రీనింగ్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సమగ్రశిక్షా, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సమన్వయంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి పదోతరగతి చదువుతున్న విద్యార్థులను పరీక్షించాలని ఆదేశించింది. ఆప్తాల్మిక్ అసిస్టెంట్‌లు బృందాలుగా ఏర్పడి విద్యార్థులకు పరీక్షలు చేసి వివరాలను నివేదించాలని ఉత్తర్వులో పేర్కొంది. ఈనెల 31లోపు కార్యక్రమాన్ని పూర్తి చేయాలాని ఆదేశాలు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాలో ఆప్తాల్మిక్ అసిస్టెంట్‌లు 12 మంది, ఉద్యోగులు 14 మంది మాత్రమే ఉండటంతో గడువు లోపు లక్ష్యాన్ని పూర్తి చేయలేని పరిస్థితి నెలకొంది.

ఇరు జిల్లాల్లో ఇలా.. (● అనంతపురం ● శ్రీసత్యసాయి)

	అనంతపురం	శ్రీసత్యసాయి
స్క్రీనింగ్ చేయాల్సిన పాఠశాలలు	2,510	1,530
కంటి పరీక్షలు పూర్తయిన బడులు	254	494
చేయించుకున్న విద్యార్థులు	31,569	45,164
పరీక్ష చేయాల్సిన విద్యార్థుల సంఖ్య	2,65,946	1,35,206
ఎంతమందికి కళ్లద్దాలు ఇవ్వాలని లక్ష్యం	4,068	1,951
కళ్లద్దాలు అవసరమని గుర్తించిన విద్యార్థుల సంఖ్య	1,199	1,389

పెరిగిన సెల్‌ఫోన్ల వినియోగంతో అనర్థం

కొవిడ్ కాలంలో పాఠశాలలకు సెలవు ఇచ్చినా ఆన్‌లైన్‌లో తరగతులు కొనసాగాయి. ఇందుకు సెల్‌ఫోన్‌లు, ట్యాబ్‌లు అవసరం కావడంతో పిల్లల తల్లిదండ్రులు వాటిని సమకూర్చారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు వాటికి విపరీతంగా అలవాటుపడ్డారు. కొవిడ్ వ్యాప్తికి అడ్డుకట్టపడి.. బడులు ప్రారంభమైనప్పటికీ విద్యార్థులు మాత్రం సెల్‌ఫోన్, ట్యాబ్‌లను వీడని పరిస్థితి నెలకొంది. చాలా మంది ఎక్కువసేపు సెల్‌ఫోన్‌తో గడుపుతున్నారు. మరికొందరు కంప్యూటర్‌లో వివిధ రకాల ఆటలు ఆడుతున్నారు. కొంత మంది తల్లిదండ్రులు.. తమ చిన్నారులు ఆహారం తినాలన్నా, ఏడుపు ఆపాలన్నా సెల్‌ఫోన్ చూపిస్తుండటంతో దృష్టిలోపం వస్తోందని వైద్యులు చెబుతున్నారు. ఎక్కువసేపు వాటిని వినియోగిస్తుండటంతో కంటి సమస్యలు వస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఎక్కువగా ఆకుకూరలతో కూడిన పౌష్టికాహారాన్ని అందించాలని, కంటి సమస్య గుర్తిస్తే వెంటనే సంబంధిత వైద్యులను సంప్రదించాలని అనంతపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాల కంటి విభాగం హెచ్‌వోడీ డాక్టర్ వై.ఎం.ఎస్.ఎస్ ప్రసాద్ సూచించారు.



విద్యార్థినికి కంటి పరీక్ష నిర్వహిస్తున్న ఆప్తాల్మిక్ అసిస్టెంట్

అందరికీ పరీక్షలు నిర్వహిస్తాం

- సైదన్న, అనురాధ, మేనేజర్లు, అంధత్వనివారణ సంస్థ, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలు

ఈ నెలలోపు ప్రభుత్వ విద్యాసంస్థల్లో అందరికీ కంటి పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. ఉద్యోగుల తక్కువగా ఉండటంతో పూర్తి స్థాయిలో చేయలేకపోతున్నాం. గడువు ముగిసినా కంటి పరీక్షల నిర్వహణ ప్రక్రియ కొనసాగుతుంది. ఇప్పటి వరకు కళ్లద్దాలు అవసరమయ్యే వారిని గుర్తించాం. అద్దాలు రాగానే అందజేస్తాం. ఉపాధ్యాయుల సహకారంతో ఆప్తాల్మిక్ అసిస్టెంట్‌లు విద్యార్థులు అందరికీ పరీక్షలు నిర్వహిస్తారు.

జిల్లా ఇన్‌ఛార్జి డీఈవోగా కిష్టప్ప

కొత్తచెరువు, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా ఇన్‌ఛార్జి డీఈవోగా కిష్టప్పను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏడాదిన్నర కాలంగా జిల్లా ఇన్‌ఛార్జి డీఈవోగా కొనసాగిన మీనాక్షిని కడప జిల్లా పొద్దుటూరు డీవైఈవోగా బదిలీ చేశారు. కడప జిల్లా పొద్దుటూరు డీవైఈవో కిష్టప్పను ధర్మవరం స్థానానికి బదిలీ చేసి ఇన్‌ఛార్జి జిల్లా విద్యాధికారిగా నియమించారు.

రహదారుల పనులు అడ్డుకుంటే చట్టపరమైన చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్, జేసీ అభిషేక్‌కుమార్

పుట్టపర్తి, న్యూస్‌టుడే: జిల్లాలో జరుగుతున్న గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ రహదారులు, రైల్వే పనులను అడ్డుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ టీఎస్ చేతన్ హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్‌లో గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ రహదారులు, రైల్వే పనుల పురోగతిపై జేసీ అభిషేక్‌కుమార్‌తో కలిసి సమీక్షించారు. జిల్లాలో జరుగుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పరిహారం చెల్లింపు విషయంలో రైతులకు ఎలాంటి అన్యాయం జరగరాదన్నారు. కోర్టు కేసులపై దృష్టిని సారించి, పరిష్కార మార్గాలు చూడాలన్నారు. పూర్తిస్థాయిలో పరిహారం అందినప్పటికీ రహదారి నిర్మాణంలో ఆటంకాలు ఎదురైతే త్రైసభ్యుల్లో సంబంధిత ఆర్డీవోలు, తహసీల్దార్లు ప్రత్యేక చొరవ తీసుకుని సమస్యలను పరిష్కరించాలని సూచించారు. నష్టపరిహారం చెల్లించిన భూముల్లో ఐసీసీ నిర్మాణ మేరకే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్డీవోలు సువర్ణ, మహేష్, ఆనంద్, శర్మ, భూసేకరణ విభాగం అధికారి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా అంగన్‌వాడీ ఉద్యోగాల భర్తీ

పుట్టపర్తి, న్యూస్‌టుడే: జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల్లో వివిధ పోస్టుల భర్తీకి మౌఖిక పరీక్షలను పారదర్శకంగా నిర్వహించినట్లు జేసీ అభిషేక్ కుమార్ పేర్కొన్నారు. గురువారం ఐసీడీఎస్ కార్యాలయంలో ఉద్యోగాలకు మౌఖిక పరీక్షలు జేసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. 12 పోస్టులకు 50 దరఖాస్తులు వచ్చాయని, అర్హత సాధించిన 29 మందికి మౌఖిక పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ నాగమల్లేశ్వరి, సోషల్ వెల్ఫేర్ అధికారి శివరంగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వేరుసెనగ తడిసి.. కన్నీరు మిగిల్చి



కనగానపల్లి మండలం మామిళ్లపల్లి వద్ద రహదారిపై ఆరబోసిన వేరుసెనగ

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వేరుసెనగ రైతు కుదేలయ్యాడు. పొలంలోనే వేరుసెనగ పాడైపోయింది. కొన్ని ప్రాంతాల్లో బయట కుప్పలుగా పోసిన కాయలు తడిసిపోయాయి. రైతులు ఆరబెట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నా కాయలు కుళ్లిపోయే పరిస్థితి ఉంది. గత రెండు రోజులు ఎండ బాగా వస్తున్నా రాత్రి వేళల్లో మబ్బులు పట్టి రైతులకు కంటి మీద కునుకు లేకుండా పోతోంది. రాప్తాడు, కనగానపల్లి మండలాల పరిధిలో జాతీయ రహదారిపై మాత్రమే కాకుండా పల్లెల్లో సైతం పలుచోట్ల తడిసిన వేరుసెనగను రైతులు ఆరబెట్టుకుంటున్నారు.

- ఈనాడు, అనంతపురం



ముక్కిపోయిన వేరుసెనగ కాయలను చూపుతున్న లింగంపల్లి రైతు వెంకట్‌రెడ్డి

పశుగణన పకడ్బందీగా చేపట్టండి

పుట్టపర్తి, న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా 21వ పశుగణన ఈనెల 25 నుంచి 2025 ఫిబ్రవరి 22వ తేదీ వరకు జరుగుతుందని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో గోడపత్రాలు, బ్రోచర్లు, స్టిక్కర్లు, సూచన పుస్తకాలను ఏడీ శుభదాస్, అధికారులతో కలిసి విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి పాడిరైతులందరూ సహకరించాలని కోరారు. జిల్లాలో పాడి రైతులు కొన్ని లక్షల కుటుంబాలు ఉన్నట్లు అంచనా వేశమన్నారు. ప్రతి కుటుంబాన్ని సందర్శించి పశుగణన చేపట్టేందుకు అధికారులు, సిబ్బంది అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. పశుగణన ప్రక్రియ పూర్తయినట్లు చిహ్నంగా ప్రతి ఇంటి ముందు తలుపునకు స్టిక్కర్ అతికించాలన్నారు. పశువులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పందులు, గుర్రాలతో పాటు, వివిధ రకాల కోళ్లు పక్షులతో సహా 16 రకాల పెంపుడు జంతువులపై జాతుల వారీగా సమాచారాన్ని సేకరించాలన్నారు. ఈ గణన ప్రక్రియ పశు సంవర్ధక రంగంపై ఆధారపడిన కుటుంబాల జీవనోపాధికి తోడ్పడేలా కార్యక్రమాల రూపకల్పనకు ఉపకరిస్తుందని వివరించారు. కార్యక్రమంలో పశు సంవర్ధశాఖ అధికారులు పాల్గొన్నారు.

పెన్నానదికి వరద

హిందూపురం, న్యూస్‌టుడే: కర్ణాటకలో బుధవారం కురిసిన వర్షానికి హిందూపురం గ్రామీణ మండలం చౌళూరు వద్ద పెన్నానదికి నీరు వచ్చి చేరుతున్నాయి. దాంతో నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం నాటికి జలాలు హిందూపురానికి చేరి పరిగి మండలంలోకి ప్రవహించే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే నియోజకవర్గంలోని కుషావతి, చిత్రావతి నదులు ప్రవహిస్తుండగా, పరిగిలో జయమంగళి నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది.



చౌళూరు వద్ద పారుతున్న జలాలు

పేద్ద... పుట్టగొడుగు



కదిరి పట్టణం, న్యూస్‌టుడే: కదిరి మండలం పట్నంలోని పొలంలో పేద్ద పుట్టగొడుగు దొరికింది. సహజంగా లభించే పుట్టగొడుగులు పది నుంచి 20 గ్రాముల బరువు మాత్రమే ఉంటాయి. షెడ్లలో పండించే పుట్టగొడుగులో కూడా దాదాపు 500 గ్రాముల వరకు ఉంటాయి. పట్నం గ్రామం వద్ద దొరికిన ఈపుట్టగొడుగు 850 గ్రాముల బరువు ఉండటంతో పుట్టగొడుగును గ్రామస్థులు ఆసక్తిగా తిలకించారు. పెద్దసైజులో పుట్టగొడుగులేచిన విషయాన్ని ఉద్యానశాఖ అధికారి జయకుమార్ దృష్టికి తీసుకెళ్లగా జన్యుపరమైన కారణాలతో పెద్దసైజు పుట్టగొడుగులు కనిపిస్తుంటాయన్నారు. సారవంతమైన నేలలు, భూమిలో అధిక ఉష్ణోగ్రత ఉన్నప్పుడు భారీసైజుతో ఉన్న పుట్టగొడుగులు లేసే అవకాశం ఉంటుందన్నారు. ఇలాంటివి తినే సమయంలో జాగ్రత్త తీసుకోవాలన్నారు. లాంటి వాటి విషయంలో వండుకునే ముందు పచ్చివాటిని రుచిచూడాలన్నారు. చేదు ఉన్నవాటిని తినకూడదని తెలిపారు.

పత్తి రైతు చిత్తు!

➠ తగ్గిన ధర.. వ్యాపారుల మాయాజాలం ➠ ప్రారంభం కాని సీసీఐ కేంద్రాలు



తాడిపత్రి పరిధిలో జిన్నింగ్ మిల్లులో పత్తి కొనుగోళ్లు

ఈనాడు, పుట్టపర్తి, న్యూస్‌టుడే, పెద్దవడుగూరు: కొన్నేళ్లుగా పత్తి రైతులను నష్టాలు వెంటాడుతున్నాయి. విపత్తులు దిగుబడిపై దెబ్బకొడితే.. వ్యాపారులు ధరలు తగ్గించి.. ఆర్థికంగా నష్టం కలిగిస్తున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి.. ఎంతో శ్రమించి సాగు చేస్తే దిగుబడులు అంతంతమాత్రంగా వస్తున్నాయి. వచ్చిన కొద్దిపాటి పంటనూ అమ్ముకునేందుకు నానా తంటాలు పడాల్సిన దుస్థితి. గిట్టుబాటు ధర లేకపోవడంతో పెట్టుబడి కూడా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం క్వింటాలుకు రూ.7,521 మద్దతు ధర ప్రకటించింది. ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాలో సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదు. దీన్ని ఆసరా చేసుకున్న వ్యాపారులు రెండు వారాల వ్యవధిలోనే క్వింటాలుపై రూ.వెయ్యి తగ్గించేశారు. రూ.6 వేల నుంచి రూ.6,500 మాత్రమే చెల్లిస్తున్నారు. గత్యంతరం లేక రైతులు తక్కువ ధరకే విక్రయిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో సాగు తీరు..

జిల్లా	సాగైంది (ఎకరాలు)	దిగుబడి అంచనా (క్వింటాళ్లు)
అనంతపురం	42,795	3.42 లక్షలు
శ్రీసత్యసాయి	5,322	42 వేలు


సగానికి సగం పడిపోయి..!

కొన్నేళ్లుగా నష్టాలు వస్తుండటంతో ఈ ఏడాది పత్తి సాగు తగ్గిపోయింది. జూన్‌లో వర్షాలు కురిసినా జులైలో లోటు వర్షపాతంతో పంట ఎదుగుదల నిలిచిపోయింది. చెట్టుకు 20 కాయలకు మించి రాలేదు. ఫలితంగా ఎకరాకు 15 క్వింటాళ్లకు పైగా రావాల్సిన దిగుబడి 7 క్వింటాళ్లు రావడం లేదని రైతులు వాపోతున్నారు. పత్తి తీసే సమయంలో భారీ వర్షాలు రావడంతో నల్లగా మారుతోంది. చెట్టుపై మిగిలిన కాయలు సైతం వర్షానికి రాలిపోతున్నాయి. ఎకరాకు రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టగా.. అది కూడా వచ్చే పరిస్థితి లేదని కర్షకులు వాపోతున్నారు.

కోతలు మొదలైనా..

ఉమ్మడి జిల్లాలో ఇప్పటివరకు సీసీఐ ఒక్క కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించలేదు. ఇప్పటికే జిల్లా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి సీసీఐకి ప్రతిపాదనలు పంపించారు. తాడిపత్రి, గుత్తి, రాయదుర్గం ప్రాంతాల్లో కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరగా.. తాడిపత్రి, గుత్తి కేంద్రాలకు అనుమతిచ్చింది. రాయదుర్గంపై ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. 3 వారాల నుంచి పత్తి కోతలు ప్రారంభమయ్యాయి. కొన్నేళ్లుగా సీసీఐ కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ఆలస్యమవుతుండటంతో రైతులు వ్యాపారులకే అమ్ముకుంటున్నారు. సెప్టెంబరు చివరి వారంలో రూ.8 వేలు పలికిన ధర ప్రస్తుతం రూ.6,500 మించడం లేదు. ఫలితంగా ఒక్కో రైతు సగటున రూ.50 వేల వరకు నష్టపోతున్నారు. మరికొందరు రైతులు ఇళ్లల్లో పత్తిని నిల్వ చేసుకుంటున్నారు.

వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



ఏటా మద్దతు ధర ప్రకటిస్తున్నా సీసీఐ కేంద్రాలు ఏర్పాటులో తీవ్ర జాప్యం చేస్తున్నారు. అప్పు తెచ్చి పెట్టుబడులు పెట్టిన రైతులు అన్ని రోజులు ఆగలేరు. ఐదెకరాల్లో పత్తి సాగు చేశాను. వ్యాపారులు రూ.6,500 మించి ఇవ్వడం లేదు. క్వింటాలు ధర రూ.8 వేలు దాటితేనే గిట్టుబాటు అవుతుంది.

- నాగేశ్వర్‌రెడ్డి, కొట్టాలపల్లి, పెద్దవడుగూరు

గత్యంతరం లేకే అమ్ముతున్నాం



ఆరు ఎకరాల్లో పత్తి సాగుచేశా. గత నెలలో రూ.8 వేలు పలికిన ధర ఇప్పుడు రూ.6 వేలకు పడిపోయింది. తేమ శాతం సాకుగా చూపి వ్యాపారులు ధర తగ్గించేస్తున్నారు. గత్యంతరం లేకనే వ్యాపారులకు పంటను అమ్ముతున్నాం. సీసీఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తేనే మేలు జరుగుతుంది.

- ఆంజనేయులు గౌనూర్, బొమ్మనహాళ్

69.60 లక్షల మొక్కల పెంపకమే లక్ష్యం: డీఎఫ్‌వో

రాంనగర్ (అనంతపురం) న్యూస్‌టుడే : ఉమ్మడి అనంతపురం జిల్లాలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద 69.60 లక్షలు మొక్కలు పెంపకమే లక్ష్యంగా పెట్టుకున్నామని ఉమ్మడి జిల్లా ఇన్‌ఛార్జి అటవీశాఖ అధికారి జి.పి.ఆనంద పేర్కొన్నారు. గురువారం అనంతపురంలో ఉమ్మడి జిల్లా అటవీ, సామాజిక వన విభాగం, డ్వామా సంయుక్త ఆధ్వర్యంలో వర్క్‌షాపు నిర్వహించారు. అటవీశాఖ ముఖ్య సంరక్షణాధికారి సెల్వం హాజరు కావాల్సి ఉండగా అనివార్య కారణాలతో రాలేకపోయారు. ఉమ్మడి అనంతపురం జిల్లా ఇన్‌ఛార్జి డీఎఫ్‌వో జీపీ అనంద, సామాజిక వన విభాగం డీఎఫ్‌వో చంద్రశేఖర్ సారధ్యంలో వర్క్‌షాపు నిర్వహించారు. వారు మాట్లాడుతూ..అనంతపురం జిల్లాలో సామాజిక వన విభాగం, అటవీశాఖకు సంబంధించి 13 నర్సరీల్లో 34.80 లక్షలు, శ్రీసత్యసాయి జిల్లాలో సామాజిక వన విభాగం, అటవీశాఖకు సంబంధించి 18 నర్సరీల్లో 34.80 లక్షలు మొక్కలు పెంపకం చేపట్టనున్నామన్నారు. ఉపాధి హామీ నిధులతోనే మొక్కలు పెంచుతామని వారు వివరించారు. ఏడాదికి కూలీలకు 100 రోజులు పనిదినాలు ఉండగా ఇప్పటికీ ఏడు నెలలు గడిచిపోతోంది. కూలీల పనిదినాలకు కష్టమవుతోందని, చిన్న సంచుల్లో మొక్కలు పెంచుతామన్నారు. పెద్ద సంచుల్లో మార్చేందుకు నివేదికల అంచనాల్లో లేదని, పెద్ద సంచులు కొనుగోలుకు అనుమతులు ఇవ్వాలని, నర్సరీల్లో చాలాచోట్ల విద్యుత్, పైప్‌లైన్లు, నీటి వసతి వంటి సౌకర్యాల్లేవని, ఉపాధిహామీ నిధులు కేటాయించలేదన్నారు. మొక్కలు పెంచేందుకు సమస్యలున్నాయని రేంజ్ ఆఫీసర్లు డీఎఫ్‌వోల దృష్టికి తీసుకొచ్చారు. వీటన్నిటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోండి

కలెక్టర్‌కు తెదేపా వినతి

ధర్మవరం, న్యూస్‌టుడే: భారీ వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని తెదేపా ధర్మవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ గురువారం కలెక్టర్ టి.ఎస్.చేతన్‌కు వినతిపత్రం అందజేశారు. పుట్టపర్తి కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి భారీ వర్షాలవల్ల ధర్మవరం నియోజకవర్గంలో పంట నష్టాన్ని వివరించారు. వేరుసెనగ, ద్రాక్ష, ఇతర పంటలు దెబ్బతిన్నాయని, లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టిన రైతులు భారీగా నష్టపోయారన్నారు. పంట నష్టంపై అధికారులతో అంచనాలు తయారు చేయించి ప్రభుత్వానికి పంపాలని, పంట నష్టపరిహారం, పంటల బీమా అందజేయాలని కోరారు. రైతులకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు విన్నవించారు.

శ్మశానాల్లో.. మట్టి దొంగలు



శ్మశానంలో పొక్లెయిన్‌తో మట్టి తవ్వకాలు

పరిగి, న్యూస్‌టుడే: పరిగిలోని శ్మశాన వాటికల్లో మట్టి దొంగలు పడ్డారు. రహదారుల అభివృద్ధి పేరుతో రాత్రింబవళ్లు తవ్వేస్తున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే దాడులకు తెగబడుతున్నారు. స్థానిక యర్రగుంట రహదారిలో ప్రభుత్వం 35ఏళ్ల కిందట మూడెకరాల స్థలాన్ని హిందూ శ్మశాన వాటికకు కేటాయించింది. ఇటీవల కొందరు ఎలాంటి అనుమతులు లేకుండా అందులో మట్టిని పొక్లెయిన్‌లతో తవ్వి ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. ఇలాగే కొనసాగితే సమాధులు కనుమరుగయ్యే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. శాసనకోట పంచాయతీలోని బాలిరెడ్డిపల్లి గ్రామ సమీపంలోని పెన్నానది పరివాహక ప్రాంతంలో ఇసుకను తవ్వడంతో సమాధులు కనుమరుగవుతున్నాయి. విద్యుత్తు స్తంభాలు సైతం కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి.

చెరువులు నిండటంతో..

గతంలో పరిగి చెరువు, జయమంగళి, యర్రగుంట చెరువు, శాసనకోటలో శివరామప్ప కుంట, నదీ పరివాహక ప్రాంతాల్లో మట్టిని తవ్వి తరలించేవారు. ఈ సారి పరిగి చెరువు నిండింది. దాంతో అక్రమార్కుల కన్ను శ్మశానాలు, ఆలయ భూములపై పడింది. గతంలో పరిగి సమీపంలోని తిరుమలదేవరపల్లికి వెళ్లే రహదారిలో జమ్మిచెట్టు వద్ద మట్టి తరలించడంతో పెద్ద గుంత ఏర్పడింది. పరిగిలో పురాతన శ్మశాన వాటిక ఉన్నా.. కబ్జాకు గురైంది. ధనాపురంలో శ్మశాన వాటిక లేకపోవడంతో మృతదేహాలకు రోడ్డు పక్కనే అంత్యక్రియలు నిర్వహిస్తున్న పరిస్థితి. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, శ్మశాన వాటికల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులు కఠినంగా వ్యవహరించాలి



కొందరు తమ స్వార్థప్రయోజనాల కోసం శ్మశానాల్లో మట్టి తవ్వేస్తున్నారు. అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తే భవిష్యత్తులో శ్మశాన వాటికలే కనిపించవు. అక్రమార్కులు ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకోవాలి. మరుభూములను కాపాడాలి.

- జయప్ప, ఇందిరమ్మ కాలనీ, పరిగి

నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకుంటాం

శ్మశానాల్లో మట్టి తరలించకుండా రెవెన్యూ సిబ్బందితో నిఘా ఉంచుతాం. పరిగి మండలంలో ఎక్కడైనా, ఎంతటివారైనా అక్రమంగా మట్టి తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ట్రాక్టర్లను, పొక్లెయిన్‌లను సీజ్ చేస్తాం.

- హసీనాసుల్తానా, తహసీల్దార్, పరిగి

వేదవతి హగరి ఉగ్రరూపం

భయాందోళనలో పరివాహక ప్రజలు



కర్ణాటకలోని జలాశయం నుంచి విడుదలవుతున్న నీరు

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: కర్ణాటక ప్రాంతంలో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు జలాశయాలు పూర్తిగా నిండటంతో గేట్లను ఎత్తివేశారు. దీంతో వేదవతి చిన్న, పెద్ద హగరి నదులు ఉగ్రరూపం దాల్చాయి. గురువారం కర్ణాటకలోని మొలకాల్మూరు తాలూకాలోని రంగయ్యదుర్గం జలాశయం గేట్లను ఎత్తడంతో వేదవతి చిన్న హగరికి నీటి మట్టం పెరుగుతోంది. బీటీపీ గేట్లను ఎత్తడంతో వేదవతి పెద్ద హగరికి నీటి మట్టం పెరుగుతోంది. రెండు నదులు బొమ్మనహాళ్ మండలం సంగమేశ్వరాలయం వద్ద కూడలిలో కలిశాయి. దీంతో కల్లుదేవనహళ్లి వద్ద వేదవతి హగరి ఉగ్రరూపం దాల్చింది. వివిధ రకాల పంటలు మునిగి కోట్లాది రూపాయలు నష్టం వాటిల్లింది. హగరి పరివాహక గ్రామాలైన బొల్లనగుడ్డం, హరేసముద్రం, శింగనహళ్లి, బండూరు, గోనూరులో వరదనీరు గ్రామాల్లోకి వస్తాయోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వరద తాకిడికి విద్యుత్తు నియంత్రికలు, స్తంభాలు, పైపులైన్లు కొట్టుకుపోవడంతో తాగు, సాగు నీటికి కష్టాలు ఏర్పడ్డాయి. వెంటనే ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తాగు, సాగు నీరు అందించాలని, అధికారులు నష్టాన్ని అంచనా వేసి పరిహారం అందేలా చూడాలని కోరుతున్నారు.



ఉద్దేహాళ్ వద్ద కాజ్‌వేపై ప్రవాహం

తాగునీటి కష్టం ఎన్నటికి తీరేను

● అర్ధాంతరంగా ఆగిన పథకాలు ● పుర ప్రజలకు కష్టాలు

గుత్తి, తాడిపత్రి పురపాలికల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. ప్రధాన తాగునీటి పథకాలన్నీ ఉనికి కోల్పోయాయి. గత వైకాపా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నీటి పథకాలన్నీ నిర్వీర్యమయ్యాయి. ఫలితంగా గుక్కెడు నీటి కోసం పురవాసులు పడరాని పాట్లు పడుతున్నారు. ఈనేపథ్యంలో క్షేత్రస్థాయిలో పరిస్థితిపై పరిశీలన కథనం.



గుత్తిలో నిలిచిపోయిన తాగునీటి పథకం సంపు నిర్మాణం

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తి పురపాలికలో తాగునీటి సమస్య తీరడం లేదు. పురపాలికలోని గుత్తి, గుత్తిఆర్.ఎస్, చెట్నేపల్లి, సూరశింగనపల్లిలో పరిస్థితి జఠిలంగా ఉంది. ఇదివరకు నెలకోసారి నీటి సరఫరా జరిగేది. గుత్తి చెరువుకు హంద్రీనీవా నీరు చేరడంతో 15రోజులకోసారి గొంతులు తడుపుతున్నారు. నాలుగు నెలల కిందట వరకు పురపాలికలో ప్రజలు తాగునీటి కోసం రోడ్డెక్కారు. పోరాటం చేస్తే నీరు సరఫరా అయ్యే పరిస్థితికి వచ్చిందని పట్టణవాసులు వాపోతున్నారు.

పథకాలన్నీ నిర్వీర్యం

● గుత్తి పరిధిలో కొత్తపేట వద్ద బోర్లు వేసి గుత్తికి సుమారు 3 కి.మీ. దూరం వరకు పైపులైన్‌ను ఏర్పాటు చేశారు. బోర్లలో నీటి ఊట తగ్గి పథకం మూలకు చేరింది.

● కొన్నేళ్ల కిందట బసినేపల్లి వద్ద బోర్లు వేసి గుత్తిఆర్.ఎస్.కు తాగునీరు అందించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీనికి గాను రూ.15 లక్షలు వెచ్చించినా వృథా అయింది.

● చెట్నేపల్లిలో 25 ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన తాగునీటి పథకం ప్రారంభానికి ముందే మూలన పడింది. ఫలితంగా నీటి కష్టాలు తప్పలేదు.

రూ.173 కోట్లతో పనులు చేపడతాం



ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తాగునీటి సమస్యను తప్పకుండా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అంటున్నారు. ఇప్పటికే గుత్తిచెరువుకు హంద్రీనీవా నీటిని నింపామన్నారు. బోర్లలో నీటి లభ్యత పెరుగుతోందని, రూ.173 కోట్లతో తాగునీటి పథకాన్ని పూర్తి చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే పురపాలికశాఖ మంత్రి నారాయణతో పథకం పూర్తికి చర్చించామని, అసెంబ్లీ సమావేశాల్లో పథకం అమలుకు మంత్రితో మరోమారు మాట్లాడతామన్నారు. పథకాన్ని గతంలో తెదేపా ప్రభుత్వం మంజూరు చేయగా వైకాపా ప్రభుత్వం మూలనపడేసింది. ఆ పనులను తిరిగి ప్రారంభిస్తామన్నారు. **-గుమ్మనూరు జయరాం, ఎమ్మెల్యే, గుంతకల్లు**

పురపాలిక	గుత్తి	తాడిపత్రి
వార్డులు	25	36
జనాభా	58 వేలు	1.30 లక్షలు
తాగునీటి అవసరం	38 లక్షల లీటర్లు	16.2 లక్షల లీటర్లు
సరఫరా అవుతున్నది	25 లక్షలు	8 లక్షలు
పథకాలు	వైటీ చెరువు, సత్యసాయి	జేసీ నాగిరెడ్డి
పవర్ బోర్లు	134	23

అమృతధార అందేనా?

తాడిపత్రి, తాడిపత్రి పట్టణం న్యూస్‌టుడే: తాడిపత్రి పుర ప్రజలకు రోజూ తాగునీరు అందించేందుకు అమృత్ పథకం ద్వారా గండికోట నుంచి పైపు లైన్ ఏర్పాటుకు 2017లో రూ.145కోట్లు మంజూరు చేశారు. అప్పట్లో నిర్మాణ పనులు బాగానే జరిగినా, 2019లో ప్రభుత్వం మారి వైకాపా అధికారంలోకి రావడంతో ఆర్థికపరమైన బిల్లులు రాలేదని పనులు ఆపేశారు. ప్రజలకు రోజూ తాగునీరు అందించాలనే లక్ష్యం ఆగిపోయింది.



సజ్జలదిన్నె వద్ద అసంపూర్తిగా..

బోరుబావులే దిక్కు..

తాడిపత్రి వాసులకు రెండు రోజులకోసారి గంట సమయం తాగునీటిని సరఫరా చేస్తున్నారు. వేసవిలో అయితే మూడు, నాలుగు రోజులకోసారి నీటి సరఫరా జరుగుతుంది. ప్రస్తుతం పెన్నానదిలో ఉన్న 23 బోరుబావులే ప్రధాన నీటి వనరు. వేసవిలో ఆ బోరుబావులు ఎండిపోతే తాగునీటి ఎద్దడితో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్ల పాటు నిర్మాణ పనులు ముందుకు సాగకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. అమృత్ పథకం పూర్తయితే గండికోట నుంచి వచ్చే నీటిని నిత్యం ప్రజలకు అందించొచ్చు.

శాశ్వత పరిష్కారం చూపుతాం



ఇది వరకు తాడిపత్రి వాసుల తాగునీటి సౌకర్యం తెదేపా ప్రభుత్వంలో అమృత్ పథకాన్ని ప్రారంభించింది. అప్పట్లో నిర్మాణ పనులు వేగవంతంగా సాగాయి. వైకాపా ప్రభుత్వంలో ఆ పనులు ఆగిపోయాయి. ప్రస్తుతం అమృత్ పథకాన్ని ఉనికిలోకి తీసుకొస్తాం. ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. సీఎంతోనే చర్చించాం. త్వరలోనే పనులు ప్రారంభించి నీటి సమస్య లేకుండా చేస్తాం. **-జేసీ అస్మిత్‌రెడ్డి, ఎమ్మెల్యే, తాడిపత్రి**

ఒకటో తరగతి నుంచే హిందీ అమలు చేయాలి

ఎస్కేయూ, న్యూస్‌టుడే: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి హిందీ భాషను పాఠ్యాంశంగా అమలు చేయాలని హిందీ ప్రచారసభ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సీఎల్ నాయుడు, గైబువల్లీ విజ్ఞప్తి చేశారు. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, పరిశ్రమల శాఖమంత్రి టీజీ భరత్, విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్‌లను హిందీప్రచారసభ ప్రతినిధులు రాజధానిలో వేరువేరుగా కలిశారు. వారికి వినతి పత్రాలు అందజేశారు. మెగా డీఎస్సీలో హిందీ ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. ఆదర్శ పాఠశాలల్లో హిందీ పీజీటీలు లేరని తెలిపారు. జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలల్లో హిందీ అధ్యాపకుల కొరత ఉందన్నారు. గత ప్రభుత్వం హిందీ పండిట్ల ప్రవేశాలు నిలిపేసిందన్నారు. ప్రవేశాలు పునరుద్ధరించాలని కోరారు.



మంత్రి అచ్చెన్నాయుడును సన్మానిస్తున్న హిందీ ప్రచార సభ ప్రతినిధులు

తోడు దొంగలు

● కొలిక్కివచ్చిన బత్తలపల్లి మండలం రామాపురం కాల్పుల ఘటన కేసు

ధర్మవరం, బత్తలపల్లి, న్యూస్‌టుడే: గుప్తనిధుల తవ్వకాల్లో పురాతన బంగారం దొరికిందని, రెండు కిలోలు రూ.ఐదు లక్షలకే ఇస్తామని ఒక ముఠా మరో ముఠాకు ఎరవేసింది. 2 కిలోల బంగారం తీసుకెళ్లేందుకు వచ్చిన మరో ముఠా డబ్బుకు బదులు నకిలీనోట్లు ఇచ్చి పోలీసుల వేషధారణలో బంగారం ఎత్తుకెళ్లాలని పన్నాగం పన్నింది. పరస్పరం మోసగించేందుకు రెండు ముఠాలు తోడుదొంగలుగా మారి.. చివరకు పోలీసులకు పట్టుబడ్డారు. వివరాలు.. శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం రామాపురం బస్టాప్ వద్ద ఈనెల 20న ఆదివారం పట్టపగలే తుపాకీ కాల్పుల ఘటన జరగడం కలకలం రేపింది. అన్నమయ్య జిల్లా శికారీపాలెంకు చెందిన కొందరు నకిలీ బంగారం ఎరవేసి డబ్బు కాజేసే ముఠాగా పోలీసుల రికార్డుల్లో ఉన్నారు. గుప్తనిధుల తవ్వకాల్లో రెండు కిలోల బంగారం దొరికింది. తక్కువ ధరకే ఇస్తామని హైదరాబాద్‌కు చెందిన నరేష్ అనేవ్యక్తికి ఎరవేశారు. ఇందులో శికారీపాలెం ముఠాకు చెందిన రాణాహర్ కీలకంగా వ్యవహరించాడు. ఇత్తడికి బంగారు పూత వేయించి బంగారాన్ని పరీక్షించుకోవాలని నరేష్‌కు ఎరవేశాడు. శికారీపాలెం ముఠా చూపించిన ఇత్తడిపూత కడ్డీని పరీక్ష చేయించగా పైపూతను పరీక్షించిన వారు బంగారంగానే భావించారు. రూ.5 లక్షలకు 2 కిలోల బంగారం ఇచ్చేందుకు శికారీపాలెం ముఠా అంగీకరించిందని నరేష్ హైదరాబాద్‌కు చెందిన అరవింద్ నాగరాజు, రితీష్‌లకు చెప్పాడు. యూట్యూబర్ అయిన అరవింద్ సైబర్ పోలీసులతో సన్నిహితంగా మెలిగేవాడు.

కాజేయాలని పథకం వేసి..

రెండు కిలోల బంగారాన్ని రూ.5 లక్షలు డబ్బు ఇవ్వకుండా కాజేయాలని నరేష్‌తో కలసి పథకం వేశాడు. అన్నమయ్య జిల్లా శికారీపాలెం నుంచి తాము ద్విచక్ర వాహనాల్లో వస్తున్నామని, రెండు కిలోల బంగారం తెస్తున్నామని, బత్తలపల్లి మండలం రామాపురం వద్దకు రావాలని శికారీపాలెం ముఠా హైదరాబాద్‌కు చెందిన నరేష్‌కు ఫోన్‌లో తెలిపారు. డబ్బు తీసుకొస్తున్నానని, ఒక కారులో నరేష్‌తో పాటు మరికొందరు రాగా మరో కారులో అరవింద్, నాగరాజు, రితీష్ మరికొందరు వచ్చారు. రామాపురం బస్టాప్ వద్ద నకిలీ బంగారం నరేష్‌కు శికారీపాలెం ముఠా ఇచ్చే సమయంలో ఇంకో కారులో వచ్చిన అరవింద్ బృందం సఫారీ దుస్తులు ధరించి ఎయిర్ పిస్టల్‌తో గాల్లో కాల్పులు జరిపారు. దీంతో పోలీసులు వచ్చారని శికారీపాలెం ముఠా నకిలీ బంగారం కడ్డీలను అక్కడే వదిలి పరారయ్యారు. బత్తలపల్లి పోలీసులకు మొదట శికారీపాలెం ముఠాకు చెందిన బంగారీ అనే యువకుడు పట్టుబడ్డాడు. దీంతో కేసు కొలిక్కి వచ్చింది. సైబర్ పోలీసులమని చెప్పి తప్పించుకున్న హైదరాబాద్ ముఠా విషయాన్ని తెలంగాణ పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి ఏపీ పోలీసులు తీసుకెళ్లారు. రెండు రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారులు రామాపురం కాల్పుల ఘటనపై వేగవంతంగా విచారణ చేయించారు. రెండు ముఠాలకు చెందిన 12 మంది పట్టుబడటంతో వారి అరెస్టును చూపించేందుకు బత్తలపల్లి పోలీసులు రంగం సిద్ధం చేస్తున్నారు.

జాతీయస్థాయి జూడో పోటీలకు విద్యార్థిని ఎంపిక



ఎంపికైన విద్యార్థినితో వ్యాయామోపాధ్యాయురాలు

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి జూడో పోటీలకు సీకేపల్లి కస్తూరిబా విద్యార్థిని మౌనిక ఎంపికైనట్లు విద్యాలయ ప్రత్యేక అధికారిణి సువర్ణ పేర్కొన్నారు. స్థానిక విద్యాలయంలో గురువారం ఆమె మాట్లాడుతూ.. ఈనెల 20, 21 తేదీల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించారన్నారు. ఆ పోటీలలో పాల్గొన్న మౌనిక అండర్-17 63 కిలోల విభాగంలో అత్యుత్తమ ప్రతిభ చాటడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. విద్యార్థిని మౌనిక స్థానిక విద్యాలయంలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యనభ్యసిస్తోందన్నారు. డిసెంబరులో త్రిపురలో నిర్వహించే జాతీయ స్థాయి జూడో పోటీలలో పాల్గొంటుందన్నారు.

కార్తిక మాసానికి ప్రత్యేక బస్సులు సిద్ధం చేయాలి

అశోక్‌నగర్ (అనంతపురం ఆర్టీసీ), న్యూస్‌టుడే: కార్తిక మాసానికి ఆయా ప్రాంతాలకు ప్రత్యేక బస్సులను సిద్ధం చేసుకోవాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆదోని అధికారులకు సూచించారు. గురువారం ఆర్ఎం కార్యాలయంలో ఆర్టీసీ జిల్లా అధికారులు, జిల్లాలోని డిపో మేనేజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నవంబరు 2 నుంచి కార్తిక మాసం ప్రారంభం కానుండటంతో శైవక్షేత్రాలకు అవసరం అయిన బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. దసరా సందర్భంగా నడిపిన ప్రత్యేక బస్సుల వల్ల ఆర్టీసీకి మంచి ఆదాయం ఒనకూరడంతో పాటు ప్రయాణికులను గమ్య స్థానాలకు సకాలంలో చేర్చామన్నారు.

పరిహారం మంజూరుకు చర్యలు

ఈనాడు కథనానికి స్పందన

గోరంట్ల, న్యూస్‌టుడే: గోరంట్ల మండలం మీదుగా ముదిగుబ్బ నుంచి కోడూరు వరకు నూతనంగా నిర్మిస్తున్న జాతీయ రహదారి 342 కోసం సేకరించిన భూములకు సంబంధించి పరిహారం అందివ్వడంలో జరుగుతున్న జాప్యం, రైతుల ఆవేదనపై 'భూములు తీసుకున్నారు - పరిహారం మరిచారు' శీర్షికన ఈనెల 11న 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్థానిక తహసీల్దార్ మారుతి స్పందించారు. భూ నిర్వాసితుల పేర్లను సేకరించి వారివద్ద ఉన్న రికార్డులను పరిశీలించారు. ఎనిమిది మంది రైతులకు సంబంధించి పరిహారం మంజూరు కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు ఆయన తెలిపారు. మందలపల్లి, గోరంట్ల, మల్లాపల్లి, బూదిలి పంచాయతీల పరిధిలోని 30 మంది రైతుల జాబితాలను సిద్ధం చేస్తున్నామని, వారికి సుమారు రూ.11 కోట్ల వరకు పరిహారం రావాల్సి ఉందని వివరించారు.

ప్రధానోపాధ్యాయిని సస్పెన్షన్

కొత్తచెరువు, న్యూస్‌టుడే: జిల్లాలోని హిందూపురం మండలంలోని ముద్దిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అంజనీ లక్ష్మీకళను సస్పెండ్ చేసినట్లు డీఈవో కార్యాలయ ఏడీ నాగరాజు తెలిపారు. చెక్ బౌన్స్ కేసులో న్యాయస్థానం హెచ్ఎంకు రిమాండ్ విధించడంతో చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. రిమాండ్ విధించిన రోజు నుంచి సస్పెన్షన్ అమలవుతుందని వివరించారు.

కాంట్రాక్ట్ ఉద్యోగిపై దుర్భాషలాడిన ఉపాధ్యాయురాలు

నల్లమాడ, న్యూస్‌టుడే: నల్లమాడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒప్పంద కార్మికుడిగా పనిచేస్తున్న సూరిపై ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయురాలు లీలారాణి దుర్భాషలాడిన ఓ వీడియో గురువారం సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేసింది. నల్లమాడ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న భాస్కర్‌రెడ్డి జిల్లా సాధారణ పరీక్షా విభాగం కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. మూడ్రోజులుగా పరీక్షల ఓరియంటేషన్ ప్రోగాం పని మీద విజయవాడకు వెళ్లారు. అప్పటి నుంచి ఇన్‌ఛార్జిగా లీలారాణి వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో ఒప్పంద ఉద్యోగి సూరి తనకు నమస్కారం పెట్టలేదనే కారణంతో పాఠశాల కార్యాలయంలోకి పిలుపించుకుని దుర్భాషలాడారు. ఈ విషయంపై ఇన్‌ఛార్జి హెచ్ఎంను వివరణ కోరగా ఒప్పంద ఉద్యోగి మద్యం తాగి పాఠశాలకు రావడంతో తిట్టినట్లు తెలిపారు. ఈ వీడియో సామాజిక మాధ్యమంలో చక్కర్లు కొట్టడంతో విద్యార్థుల తల్లిదండ్రులు పలువిధాలుగా చర్చించుకుంటున్నారు. దీనిపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి.

నాయీబ్రాహ్మణులకు తెదేపా అండ



ప్రదర్శన నిర్వహిస్తున్న నాయీబ్రాహ్మణ సంఘం, తెదేపా నాయకులు

హిందూపురం, న్యూస్‌టుడే: నాయీ బ్రాహ్మణులకు తెలుగుదేశం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆ సంఘం రాష్ట్ర నాయకులు నాగరాజు, పట్టణ తెదేపా అధ్యక్షుడు డీఈ రమేశ్‌కుమార్ తెలిపారు. నాయీబ్రాహ్మణులకు దేవాలయాల్లో చోటు కల్పించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక అంబేడ్కర్ కూడలిలో సీఎం చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే బాలకృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు నరసింహారెడ్డి, అధ్యక్షుడు మంజునాథ్, వర్కింగ్ ప్రెసిడెంట్ హరి, ఉపాధ్యక్షులు నాగేశ్, నరేశ్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి రఘు, ప్రచార కార్యదర్శి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ ప్రాధికార సంస్థ సభ్యులుగా ఎస్కేయూ, జేఎన్‌టీయూ ఆచార్యులు

ఎస్కేయూ, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ పర్యావరణ ప్రభావ మదింపు ప్రాధికార సంస్థ రాష్ట్రస్థాయి నిపుణుల పరిశీలన కమిటీలో ఎస్కేయూ, జేఎన్‌టీయూలకు చెందిన ముగ్గురు ఆచార్యులకు స్థానం దక్కింది. భారత పర్యావరణ మంత్రిత్వశాఖ ఈ కమిటీ నియమించింది. జేఎన్‌టీయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో ఆచార్యురాలు భవాని, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం రసాయనశాస్త్ర విభాగం విశ్రాంత ఆచార్యులు సుధాకర్‌బాబు, అర్థశాస్త్రం విభాగానికి చెందిన మరో ఆచార్యుడు కమిటీలో సభ్యులుగా నియమితులయ్యారు. ఆచార్య సుధాకర్‌బాబు ఎస్కేయూ రిజిస్ట్రార్‌గా పనిచేశారు. పర్యావరణంపై ఆయన విస్తృత పరిశోధనలు నిర్వహించారు. ఆచార్య భవాని జల కాలుష్యంపై పరిశోధనలు చేశారు. ఆమె పరిశోధనలకు పేటెంట్ కూడా దక్కింది.

జూనియర్ న్యాయవాది బలవన్మరణం

● ఉద్యోగం రాలేదని మనస్తాపం: కుటుంబసభ్యులు



రుక్సానా

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే : అనంతపురం కోర్టులో జూనియర్ న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న రుక్సానా (27) గురువారం బలవన్మరణానికి పాల్పడింది. రెండో పట్టణ ఎస్సై రుషేంద్రబాబు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు. .శ్రీసత్యసాయి జిల్లా బుక్కపట్నం మండలం సిద్దరాంపురం గ్రామానికి చెందిన లాలూసాబ్, దిల్‌షద్‌లకు ముగ్గురు కుమార్తెలు. పెద్దమ్మాయి రుక్సానా ఎంకామ్ ఎల్ఎల్‌బీ పూర్తి చేసి జిల్లా కోర్టులో ఓ సీనియర్ లాయర్ వద్ద ప్రాక్టీస్ చేస్తోంది. రెండేళ్లుగా తన చెల్లెళ్లు రేష్మా, కౌసర్‌లతో కలిసి స్థానిక కోర్టు రోడ్డులో ఓ ఇంట్లో నివాసం ఉంటున్నారు. రోజులాగే చెల్లెళ్లు కళాశాలలకు వెళ్లారు. మధ్యాహ్నం సోదరి కళాశాల నుంచి వచ్చింది. తలుపులు తెరిచి చూడగా గదిలో రుక్సానా ఉరికి వేలాడుతూ కనిపించింది. భయపడిన అమ్మాయి పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చింది. స్థానికులు, టూటౌన్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ఆసుపత్రికి తరలించే లోపే మృతి చెందింది. ఎస్సై రుషేంద్రబాబు ఘటనపై స్థానికులు, పక్కింటి వారిని ప్రశ్నించారు. క్లూస్ టీం ఘటనాస్థలిలో ఆధారాలు సేకరించారు. జాగిలంతో పరిసరాలను పరిశీలించారు. తండ్రి లాలుసాబ్ టూటౌన్‌లో ఫిర్యాదు చేశారు. 'తమ కుమార్తె చదువు పూర్తయినప్పటి నుంచి పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతుండేదని, ప్రభుత్వ ఉద్యోగం రాలేదనే అసంతృప్తి ఉండేదని, తమతో తరచూ బాధను వ్యక్తం చేసేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు.

మృతిపై పలు అనుమానాలు

న్యాయవాది మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉరికి వేలాడుతున్న మృతదేహం కాళ్లు నేలపై పూర్తిగా ఆనుకుని ఉన్నాయి. రాత్రి గానీ, అంతకు ముందు గానీ చెల్లెళ్లతో ఎలాంటి బాధను వ్యక్తం చేయలేదని, సంతోషంగా ఉందని తెలుస్తోంది. ఆత్మహత్య చేసుకునేంత బలహీన మనస్తత్వం కాదనీ సహచరులు, బంధువులు చెబుతున్నారు. ఇవన్నీ పోలీసులు దర్యాప్తులో తేలాల్సి ఉంది.

వరద బాధితులను ఆదుకోండి: సునీత



కనగానపల్లిలో తెగిన చెరువు కట్టను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

కనగానపల్లి, రాప్తాడు, న్యూస్‌టుడే: వరదలతో రాప్తాడు నియోజకవర్గంలో పంటలకు అపార నష్టం వాటిల్లిందని, చాలామంది గృహాలను కోల్పోయారని వారందరినీ ఆదుకోవాలని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్‌కు ఎమ్మెల్యే పరిటాల సునీత విజ్ఞప్తి చేశారు. గురువారం కనగానపల్లి మండల కేంద్రంలో తెగిన చెరువు కట్టతోపాటు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. అనంతరం పంటలను కోల్పోయిన రైతులతో కలెక్టరు, ఎమ్మెల్యే మాట్లాడారు. కలెక్టర్ మాట్లాడుతూ.. కనగానపల్లిలో 198.2 మీమీ వర్షం కురవడం వల్ల చెరువు తెగినట్లు వివరించారు. చెరువు మరమ్మతుకు రూ.50 లక్షలు, పంటలు కోల్పోయిన రైతులకు పరిహారం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు రైతులతో కలిసి సునీత వినతిపత్రం అందజేశారు.

ఇళ్ల నిర్మాణాల్లో అవినీతి జలగ రాక్రీట్

పేదల ఇళ్లనిర్మాణాల పేరుతో గత ఐదేళ్లలో అవినీతికి పాల్పడిన వారిని వదిలేది లేదని సునీత అన్నారు. రాప్తాడు ఎంపీడీవో కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖ, రెవెన్యూ అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వంలో ఇళ్ల నిర్మాణాల పేరుతో జరిగిన దోపిడీ గురించి ప్రధానంగా ప్రస్తావించారు. ఆలమూరు, రాచానపల్లి కాలనీల్లో రాక్రీట్ సంస్థ ఇళ్లు నిర్మించేలా అనుమతులు ఇచ్చారని, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి చెందిన ఆ సంస్థ అనేక అవినీతి కార్యక్రమాలకు పాల్పడిందన్నారు. వీటిపై విజిలెన్స్ విచారణ జరుగుతోందన్నారు. అనంతపురం శివారు కాలనీల్లో ఇళ్లు లేని పేదలకు కాకుండా కార్లలో వచ్చేవారికి, వైకాపా నాయకులకు, కార్యకర్తలు, బినామీలకు ఇళ్లు ఇచ్చారని సునీత ఆరోపించారు. ప్రతి గ్రామంలో కాలనీల్లో ఇళ్లు పొందిన లబ్ధిదారుల్లో చాలామంది వాటిని అమ్ముకున్నారని, అన్నింటిపై విచారణ చేయాలన్నారు.

మనస్తాపంతో నిప్పంటించుకొని ఆత్మహత్యాయత్నం

తనకల్లు, న్యూస్‌టుడే: ఒంటిపై పెట్రోల్ పోసుకొని వ్యక్తి నిప్పంటించుకున్న ఘటన మండలంలోని బాలసముద్రం పంచాయతీ మారప్పగారిపల్లిలో గురువారం జరిగింది. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. వెంకటరమణ, నరసింహులు ఇళ్లు ఎదురెదురుగా ఉన్నాయి. మురుగు విషయమై కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. గురువారం మరోమారు గొడవ జరగడంతో మనస్తాపం చెందిన వెంకటరమణ, భార్య, ఇద్దరు పిల్లలు ఒంటిపై పెట్రోల్ పోసుకున్నారు. స్థానికులు సర్దిచెప్పడంతో మిన్నకుండిపోయిన భార్య, పిల్లలు వారి పనుల్లో నిమగ్నమయ్యారు. ఇంతలో వెంకటరమణ నిప్పంటించుకొని ఇంట్లో నుంచి బయటకు రాగా స్థానికులు గుర్తించి మంటలు ఆర్పివేశారు. తనకల్లు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి అక్కడి నుంచి కదిరి ప్రాంతీయ వైద్యశాలకు తీసుకెళ్లి చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు తిరుపతికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి



అలివేలమ్మ

పెనుకొండ, న్యూస్‌టుడే: మిద్దెపై దుస్తులు ఆరవేయడానికి వెళ్లిన ఓ మహిళ ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది. పోలీసులు, గ్రామస్థుల వివరాల మేరకు.. మండలంలోని మరువపల్లి గ్రామానికి చెందిన అలివేలమ్మ(45) గురువారం ఉదయాన్నే దుస్తులు ఉతికి ఆరవేసేందుకు మిద్దెపైకి వెళ్లారు. పక్కనే ఉన్న విద్యుత్తు తీగలు చేతికి తగిలి ఆమె మృతి చెందారు. ఆమెకు నలుగురు కుమార్తెలు ఉన్నారు. అందరికీ వివాహం జరిపించారు. విద్యుత్తుశాఖ ఏఈ నారాయణస్వామి, ఏడీ వివేకానంద ఘటనా స్థలాన్ని పరిశీలించి, వివరాలు సేకరించారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత మృతురాలి భర్త రామచంద్రను ఫోన్‌లో పరామర్శించారు. అన్ని విధాలుగా ఆదుకుంటామని, ప్రభుత్వం నుంచి రూ.5లక్షల పరిహారం అందజేస్తామని భరోసా ఇచ్చారు. పార్టీశ్రేణుల ద్వారా అంత్యక్రియల కోసం రూ.10 వేలు నగదు అందజేశారు.

హిందూపురం

•హిందూపురం •పెనుకొండ •మడకశిర

మాంసం వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ వేస్తే చర్యలు

గోరంట్ల, న్యూస్‌టుడే: గోరంట్లలోని మాంసం దుకాణాల నిర్వాహకులు చికెన్, మటన్, చేపల వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేస్తే కఠిన చర్యలు తప్పవని మేజర్ పంచాయతీ కార్యదర్శి సంజయ్‌నాయక్ గురువారం హెచ్చరించారు. ఈమేరకు దుకాణదారులకు తాఖీదులు జారీ చేశారు. ఇటీవల రావిమంట ఏరియా, కమ్మవారిపల్లి రోడ్డు, ఎమకలగుట్టపల్లి రోడ్డు తదితర ప్రాంతాల్లో వ్యర్థాలను పడేసిన తీరుపై ఇబ్బంది పడిన ఆ ప్రాంతవాసులు కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. దుకాణాల వద్దకే పంచాయతీ సిబ్బందిని పంపుతామని, అక్కడి నుంచే నేరుగా తొలగించే చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

చిన్న వర్షానికే చిత్తడి

శివారు కాలనీల్లో రహదారులు అధ్వానం


మారుతినగర్‌లో బురదతో నిండిన రోడ్డు

మడకశిర, న్యూస్‌టుడే: మడకశిర నగర పంచాయతీ పరిధిలోని శివారు కాలనీల్లో రహదారులు చిన్న వర్షానికే బురదతో నిండి పోతున్నాయి. కాలువలు పొంగి పొర్లుతూ మురుగు రోడ్లపైకి చేరుతుంది. పట్టణంలోని ప్రధాన రహదారుల్లో సైతం గుంతలు ఏర్పడి, నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. మారుతినగర్, బేల్దార్ కాలనీ లోతట్టు ప్రాంతం కావడంతో పైనుంచి వచ్చే వర్షపునీరు మొత్తం ఇక్కడే నిలుస్తోంది. మట్టి దారులు కావడంతో చిత్తడిగా మారుతున్నాయి. అడుగు వేయలేని పరిస్థితి ఉంది. శివాపురంలో కాలువలు చిన్నవిగా ఉండటంతో వర్షపునీరు పారేందుకు వీలు లేక పావగడ వెళ్లే ప్రధాన రహదారిపై నిల్వ చేరుతున్నాయి. చౌటిపల్లి, యాదవ కాలనీ, చీపులేటి, బేగార్లపల్లి కాలనీల్లో సీసీ రోడ్లు, మురుగు కాలువల వ్యవస్థ లేదు. గతంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించి నిధులు మంజూరు చేసినా.. అభివృద్ధి శూన్యం. అధికారులు, పాలకులు కాలనీల్లో పర్యటించి, వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

నగర పంచాయతీ:	మడకశిర
వార్డులు	: 20
జనాభా	: 28వేలు
శివారు కాలనీలు:	మారుతి నగర్, శివాపురం, బేల్దార్ కాలనీ, చీపులేటి, చౌటిపల్లి, యాదవ కాలనీ, బేగార్లపల్లి, అక్కంపల్లి

పొదుపు మంత్రం.. ఉపాధికి ఊతం


మడకశిరలో చిరుతిళ్ల వ్యాపారం చేస్తున్న మహిళా సభ్యులు

మడకశిర, లేపాక్షి, సోమందేపల్లి, న్యూస్‌టుడే: పొదుపు సంఘాల మహిళలు చిరు వ్యాపారాలు చేస్తూ ఆర్థిక ప్రగతి దిశగా సాగుతున్నారు. ఎదుటి వారికి అప్పులు ఇచ్చే స్థాయికి ఎదిగారు. తమ పొదుపు సొమ్ముతో పాటు బ్యాంకు రుణాలు పొంది వ్యాపారాలు విస్తరింపచేసుకుంటూ ఆర్థికంగా బలపడి ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రభుత్వ సహకారంతో విజయ పథంలో నడుస్తున్నారు. పెద్దగా చదువుకోకున్నా ఆర్థిక లావాదేవీలను సొంతంగా నిర్వహిస్తూ పిల్లలను చదివిస్తు స్ఫూర్తిగా నిలుస్తున్న మహిళల గురించి కథనం.

చిరు వ్యాపారాలతో ఆదాయం

మడకశిర నగర పంచాయతీలో మెప్మా ఆధ్వర్యంలో 570 మహిళా సంఘాలు ఉండగా 6,056 మంది సభ్యులు ఉన్నారు. ఈ ఏడాది సంఘాలకు మొత్తం రూ.6.32కోట్లు రుణం అందజేశారు. లక్ష్మీప్రసన్న మహిళా సంఘం సభ్యులు రెండేళ్లలో రూ.20లక్షలు రుణం పొందారు. వాటితో తినుబండారాల వ్యాపారం, అద్దె కార్లు, సెంట్రింగ్ సామగ్రి, వ్యవసాయం చేస్తూ ఒక్కొక్కరు రోజుకు రూ.3వేల నుంచి 10వేల వరకు సంపాదిస్తున్నారు.

ఆర్థికంగా నిలదొక్కుకొని..

లేపాక్షి మండలం గలిబిపల్లికి చెందిన దీపిక మహిళా సంఘంలో 12 మంది సభ్యులు ఉన్నారు. వీరందరూ సంఘం ద్వారా ప్రస్తుతం రూ.12లక్షలు బ్యాంకు నుంచి రుణం తీసుకుని వాటిని వ్యక్తిగత అవసరాలకు కాకుండా ఆదాయాభివృద్ధికి వినియోగించుకుంటున్నారు. సంఘంలోని సభ్యులందరూ సొంతిళ్లు కట్టుకోవడమే గాక, పిల్లలను ఉన్నత చదువులు చదివించారు. రూ.30లక్షలతో దుకాణాలు ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా స్థిరపడ్డారు.

సోమందేపల్లి స్నేహలతా నగర్‌కు చెందిన విజయలక్ష్మి డ్వాక్రా సంఘం మహిళా సభ్యులు మొదట్లో రూ.80 వేలు రుణం పొందారు. ఆ సొమ్మును సద్వినియోగం చేసుకొంటూ. . తిరిగి సక్రమంగా చెల్లించారు. బ్యాంకు అధికారులు ఈ సంఘానికి రూ.20 లక్షలు రుణాన్ని మంజూరు చేశారు. లీడర్లు అమీనా, సావిత్రమ్మ, సభ్యులు సలీమ్‌బీ, హుస్సేన్‌బీ, దిల్‌షాద్, శోభ, ఈశ్వరమ్మ, హసీనా, జమీల, ఆషాబీ తదితరులు రుణాన్ని పంచుకొని వ్యాపారులు సాగిస్తున్నారు.


సోమందేపల్లి: మర మగ్గాలు నిర్వహిస్తున్న సలీమ్‌బీ

మరమగ్గాలతో జీవనోపాధి: - సలీమ్‌బీ, స్నేహలతా నగర్, సోమందేపల్లి

బ్యాంకు రుణాలతో ప్రస్తుతం మూడు మరమగ్గాలు ఏర్పాటు చేసుకొన్నాం. నా భర్త షఫీవుల్లాతో కలిసి రోజూ చీరలు తయారు చేస్తున్నాం. వచ్చే ఆదాయంతో జీవనం సాఫీగా సాగుతోంది. బ్యాంకు రుణం సక్రమంగా చెల్లిస్తూనే. . కుమారుడు నౌషాద్‌ను ఎంబీఏ చదివించాం. ప్రస్తుతం తిరుపతిలో శిక్షణ పొందుతున్నాడు. రెండోవాడు నజీర్ హిందూపురంలో డిగ్రీ మొదటి ఏడాది చదువుతున్నాడు. ప్రభుత్వం, అధికారుల సహకారం మరువలేనిది.

తూకం రాళ్లకు సీళ్లు వేయించకపోతే చర్యలు

సోమందేపల్లి, న్యూస్‌టుడే: స్థానిక వారపు సంతలో తూకం రాళ్లకు గురువారం తూనికలు-కొలతల శాఖ అధికారి శివశంకర్, సిబ్బంది సీళ్లు వేయించారు. ప్రతి రెండేళ్లకు ఒకసారి తూకం రాళ్లు, ఏడాదికొకసారి విద్యుత్తు తూకాల యంత్రాలకు తప్పక సీళ్లు వేయించాలని అధికారి తెలిపారు. నల్లబండ రాళ్లను ఇకపై ఎవరూ వాడరాదని ఆయన వ్యాపారులకు హెచ్చరించారు. మరో రెండు రోజులపాటు రాళ్లకు సీళ్లు వేయిస్తామని, అందరూ సద్వినియోగం చేసుకోవాలనిసూచించారు. తూకాల్లో ప్రజలను మోసం చేయరాదని అవగాహన కల్పించారు. మండలంలోని చాలకూరులో వినియోగదారుల సమక్షంలో గ్యాస్ బండలకు తూకం వేయించారు. ఎవరైనా మోసాలకు పాల్పడుతుంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.

‘డీఎస్సీలో ఉర్దూ పోస్టుల ఖాళీలు ప్రకటించాలి’

హిందూపురం, న్యూస్‌టుడే: డీఎస్సీలో ఉర్దూ భాషకు సంబంధించి ఖాళీలు ఎన్ని ఉన్నాయో ప్రకటించాలని ఉర్దూ భాషా అభివృద్ధి సంఘం అధ్యక్షుడు మహ్మద్ రఫిక్ అధికారులను కోరారు. గురువారం ఆయన నియోజకవర్గంతో కలిసి ఉప తహసీల్దార్ వెంకటేశులుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉర్దూ చదువుకున్న నిరుద్యోగులు అధిక సంఖ్యలో ఉన్నారని, పోస్టులు ఎన్ని ఖాళీగా ఉన్నాయనేది విషయం స్పష్టంగా తెలియడం లేదన్నారు.

చెత్తాచెదారం తొలగింపు

పరిగి, న్యూస్‌టుడే: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో నీటి ట్యాంకు వద్ద చెత్తాచెదారం పేరుకుపోయిందని ‘ఈనాడు’లో వార్త కథనం ప్రచురితమైంది. పంచాయతీ కార్యదర్శి నారాయణ, సహాయ కార్యదర్శి రంగనాథ్ స్పందించి పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులతో చెత్త తొలగించేశారు.

26న ఉచిత గుండె వైద్యశిబిరం

లేపాక్షి, న్యూస్‌టుడే: హిందూపురం జనసేన బాధ్యుడు ఉమేష్ ఆధ్వర్యంలో మండల నాయకుడు లోకేష్ సహకారంతో ఈ నెల 26న లేపాక్షి ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

జాతీయ నాయకుల విగ్రహాలు ఏర్పాటు చేయాలి

గుడిబండ, న్యూస్‌టుడే: గుడిబండ పట్టణంలో జాతీయ నాయకులు, స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలు ఏర్పాటు చేయాలని లోక్‌కళ్యాణ్ ప్రజాసేవా సమితి సభ్యులు డిమాండు చేశారు. ఈమేరకు గుడిబండ ఇన్‌ఛార్జి తహసీల్దార్ రాంభూపాల్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘ అధ్యక్షుడు సజ్జాలు జయన్న, కేజీ విరుపాక్షప్ప తదితరులు పాల్గొన్నారు.

బిందు సేద్యం పరికరాల పంపిణీ

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను ఏపీఎంఐపీ ద్వారా 90 శాతం రాయితీతో రైతులకు బిందు సేద్యం పరికరాలు అందిస్తున్నట్లు ఎంఐపీ బి.నరసింహప్ప తెలిపారు. గురువారం మడకశిర మండలం ఆర్.అనంతపురం, అయ్యవారిపల్లి, సి.కొడిగేపల్లి గుడిబండ మండలంలోని కొంత మంది రైతులకు వాటిని పంపిణీ చేశారు.

పట్టణ సమాఖ్య ఎన్నిక ఏకగ్రీవం

పెనుకొండ, న్యూస్‌టుడే: స్థానిక నగర పంచాయతీలోని మెప్మా భవనంలో మహిళా సంఘాల లీడర్లు సమావేశమై పట్టణ సమాఖ్య కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా అశ్వర్థమ్మ, కార్యదర్శిగా భాగ్యమ్మ, సహాయ కార్యదర్శిగా పక్కీరమ్మ ఎన్నుకున్నారు. తెదేపా పట్టణ కన్వీనర్ శ్రీరాములు నూతన కమిటీని అభినందించారు. కార్యక్రమంలో మెప్మా సీవో హరినాథ్, తెదేపా పట్టణ ధ్యక్షురాలు రమణమ్మ పాల్గొన్నారు.

ఆర్‌ఈఎఫ్ జిల్లా కమిటీలో చోటు

రొద్దం, న్యూస్‌టుడే: రాష్ట్ర రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కమిటీ(ఆర్‌ఈఎఫ్) శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శిగా రొద్దం మండలానికి చెందిన ఉద్యోగులు హరికృష్ణ, ఉపాధ్యక్షుడిగా బోయ నరసింహులును ఎన్నుకున్నట్లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

విద్యుత్తు ఉప కేంద్రంలో మరమ్మతులు

సోమందేపల్లి, న్యూస్‌టుడే: స్థానిక నల్లగొండ్రాయనపల్లి విద్యుత్తు ఉప కేంద్రంలో గురువారం ఏఈ పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్మికులు, లైన్‌మెన్లు మరమ్మతులు చేపట్టారు. ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు విద్యుత్తు సరఫరాను ఆపివేయడంతో చేనేత, మరమగ్గాల మాస్టర్‌వీవర్లు, యజమానులు, కార్మికులు, దుకాణాల వ్యాపారులు, ముఖ్యంగా తాగునీటికి ప్రజలు, మహిళలు అన్ని వర్గాల తీవ్ర అవస్థ పడ్డారు. ఉప కేంద్రంలో మరమ్మతులతోపాటు పలు గ్రామాల్లో విద్యుత్తు లైన్ల కింద అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను సిబ్బంది తొలగించారు. అల్ప పీడనం కారణంగా వారం రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్తు సరఫరాలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఈ చర్యలు చేపట్టామని ఏఈ తెలిపారు.

సొంత నిధులతో రహదారికి మరమ్మతులు


పొక్లెయిన్‌తో చదును చేయిస్తున్న గ్రామస్థులు

రొద్దం, న్యూస్‌టుడే: మండలంలోని దొడగట్ట నుంచి డీఆర్ కొట్టాల మట్టి రహదారి మునిముక్తావతి నది ప్రవాహంతో కోతకు గురైంది. గ్రామస్థులు గురువారం సొంత నిధులు వెచ్చించి పొక్లెయిన్‌తో మట్టి చదును చేసి మరమ్మతులు చేశారు. గత ముప్పై ఏళ్లుగా ఈ సమస్య ఉందని, ప్రభుత్వం వంతెన నిర్మించడంలో అలసత్వం వహిస్తుందని గ్రామస్థులు ఆరోపించారు. కూటమి ప్రభుత్వం తారు రోడ్డు మంజూరు చేయించాలని వారు కోరారు.

ప్రతిభకు ప్రోత్సాహం





హిందూపురంలోని ఎంజీఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో గురువారం ‘ఈనాడు’ ఆధ్వర్యంలో ‘అంతర్జాలం వినియోగంలో లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం’ అనే అంశంపై ప్రతిభా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అత్యధిక మంది విద్యార్థులు పాల్గొన్నారు. 10వ తరగతి చదువుతున్న వై.జయంతి ప్రథమ, 9వ తరగతి చదువుతున్న బి.మేఘవర్షిని ద్వితీయ, 10వ తరగతి చదువుతున్న ఎంఎస్ పూజిత తృతీయ స్థానంలో నిలిచారు. వీరికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు సామ్రాజ్యం బహుమతులు అందజేశారు.
- న్యూస్‌టుడే, హిందూపురం

సమస్య: మడకశిర మండలంలోని జక్కేపల్లి గ్రామంలో రావిచెట్టు వద్ద మురుగునీరు నిలిచి దుర్వాసన వస్తోంది. శుభ్రం చేయించాలి. **- గ్రామస్థులు**

సమాధానం: హరితరాయబారులను పంపి మురుగు తొలగించేస్తాం. - అశ్వర్థరెడ్డి, మెళవాయి పంచాయతీ కార్యదర్శి **- న్యూస్‌టుడే, మడకశిర గ్రామీణం**

జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక


మౌనిక


ధనాపురం(పరిగి), న్యూస్‌టుడే: మండల పరిధిలోని ధనాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని మౌనిక అండర్-17 జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం జ్యోతిర్మయి, పీడీ మహేష్‌దీపక్ తెలిపారు. హిందూపురంలోని ముద్దిరెడ్డిపల్లిలో ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి బాల బాలికల వాలీబాల్ పోటీల్లో మౌనిక ప్రాతినిధ్యం వహించింది. అందులో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల హెచ్‌ఎం, పీడీ, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యకమిటీ సభ్యులు, గ్రామస్థులు విద్యార్థినిని అభినందించారు.

రాష్ట్రస్థాయి హాకీ జట్టుకు..


కరస్పాండెంట్, పీఈటీతో విద్యార్థిని సాయిభవిత

పెనుకొండ: పట్టణంలోని శాంతినికేతన్ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న సాయిభవిత రాష్ట్రస్థాయి హాకీ జట్టుకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. వచ్చే నెల 3నుంచి 5వతేదీ వరకు నెల్లూరులో జరిగే పోటీల్లో విద్యార్థిని పాల్గొంటుందని తెలిపారు. విద్యార్థినితోపాటు పీఈటీ శ్రీనివాసులును ఆయన అభినందించారు.

మనోహర్ మృతి తెదేపాకు తీరని లోటు


నివాళి అర్పిస్తున్న ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి

మడకశిర, న్యూస్‌టుడే: తెదేపా మడకశిర పట్టణ అధ్యక్షుడు మనోహర్ మృతి పార్టీకి తీరని లోటని ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు పేర్కొన్నారు. పది రోజుల కిందట గుండెనొప్పితో ఆయన ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎంపీ, ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, తెదేపా జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట్ల అంజినప్ప, తెదేపా రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి తదితర నాయకులు గురువారం పార్టీ కన్వీనర్ మృతదేహానికి పసుపు జెండా కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాడెను మోసి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

వరి రైతుకు తీరని నష్టం


నేలవాలిన పైరును చూపుతున్న రైతు

లేపాక్షి, న్యూస్‌టుడే: మండల వ్యాప్తంగా ఇటీవల కురిసిన వర్షాలకు చేతికందిన పంటలు నేలవాలి కుళ్లిపోతున్నాయి. కంచిసముద్రం పంచాయతీ బసవన్నపల్లిలో రైతులు రామాంజినప్ప, లక్ష్మప్ప, సోమిరెడ్డిపల్లిలో రైతు నరసింహారెడ్డి సాగు చేసిన వరి పంట కోత దశలో ఉండగా వర్షం ధాటికి నేలకూలింది. తాము తీవ్రంగా నష్టపోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

కర్ణాటక మద్యం కేసులో నిందితుడికి జైలు

రొద్దం, న్యూస్‌టుడే: కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడిన కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష విధించినట్లు రొద్దం ఎస్‌ఐ నరేంద్ర గురువారం పేర్కొన్నారు. పెనుకొండ మండలంలోని మావటూరుకు చెందిన చిన్న అంజనప్ప 2020 సంవత్సరంలో కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడ్డాడు. అప్పటి ఎస్సై నారాయణ కేసు నమోదు చేశారు. పెనుకొండ న్యాయమూర్తి ఎం.బుజ్జప్ప కేసును విచారించి నిందితుడికి మూడేళ్ల జైలు శిక్షతోపాటు రూ.2 లక్షలు జరిమానా విధించినట్లు ఎస్‌ఐ వివరించారు.

వాహనం బోల్తా.. తప్పిన ప్రమాదం

సోమందేపల్లి, న్యూస్‌టుడే: స్థానిక జాతీయ రహదారిపై ఇనుప సామగ్రితో బెంగళూరుకు వెళ్తున్న ఐషర్ వాహనం బుధవారం అదుపు తప్పి బోల్తా పడింది. మహారాష్ట్రకు చెందిన వాహన డ్రైవర్ దీపక్, క్లీనర్ పక్కకు దూకేశారు. ఇద్దరు క్షేమంగా బయట పడ్డారని హెచ్‌సీ సుధాకర్ తెలిపారు. క్రేన్‌తో వాహనాన్ని బయటకు తీశారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమించిన 21 మందికి తాఖీదులు

గోరంట్ల, న్యూస్‌టుడే: మండల కాంప్లెక్సు చుట్టూ ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన 21 మందికి తాఖీదులు జారీ చేసినట్లు తహసీల్దార్ మారుతి తెలిపారు. వీరిలో కొంతమంది హైకోర్టుకు వెళ్లారని, దాంతో కార్యాలయ సిబ్బంది కోర్టుకు హాజరై సమాధానం ఇచ్చినట్లు పేర్కొన్నారు. త్వరలోనే తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఫలించిన పరిశోధన


ఒకే మొక్కకు కాసిన వంకాయ, టమాటా

గోరంట్ల, న్యూస్‌టుడే: గోరంట్ల మండలంలోని కమ్మలవాండ్లపల్లి సమీపంలో ఉన్న భారతీయ ఇంజినీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (బెస్ట్) ఇన్నోవేషన్ యూనివర్శిటీలో నాల్గో సంవత్సరం అగ్రికల్చర్ బీఎస్సీ చదువుతున్న విద్యార్థులు ఒకే మొక్కకు వంకాయ, టమాటా కాయలు కాసే విధంగా కృషి చేసి విజయవంతం అయ్యారని రిజిస్ట్రార్ జయప్రకాశ్ తెలిపారు. వ్యవసాయ విభాగం డీన్ డాక్టర్ రాంగోపాల్, మాడ్యూల్ కోఆర్డినేటర్ డాక్టర్ సతీశ్ పర్యవేక్షణలో విద్యార్థులు ఈ విజయాన్ని సాధించారని రిజిస్ట్రార్ వివరించారు. టమాటా, వంకాయ హైబ్రీడ్ మొక్కలను అంటుకట్టు పద్ధతిలో పెంచినట్లు పేర్కొన్నారు.

కోడూరు కట్ట కాలువకు గండి



కర్ణాటకలో కురుస్తున్న వర్షాలకు అక్కడి జలాశయాలు, చెరువులు నిండి మరువ పారుతున్నాయి. పైనుంచి కోడూరు ప్రధాన చెరువుకు నీరు వచ్చి చేరుతుండగా గురువారం కట్ట కాలువకు గండి పడింది. దాంతో జలాలు వృథాగా పారుతూ కుషావతి నదిలోకి కలుస్తున్నాయి. సర్పంచి మురళీమోహన్ పొక్లెయిన్, కూలీల సాయంతో గండిని పూడ్చివేశారు. చిలమత్తూరు ప్రధాన చెరువుకు లాలేపల్లి గ్రామ సమీపంలోని కట్టకాలువకు గండి పడిన విషయం విదితమే. గురువారం సర్పంచి సంధ్యారాణి, ప్రజాప్రతినిధులు, అధికారులు గండికి మరమ్మతులు చేయించారు. **- న్యూస్‌టుడే, చిలమత్తూరు**

మోడు బారి.. ప్రమాదంగా మారి



హిందూపురం పట్టణంలోని రహమత్‌పూర్ సర్కిల్ నుంచి రైల్వే రోడ్డులో మారెమ్మ దేవాలయం పక్కన చెట్టు ఎండిపోయి ప్రమాదకరంగా మారింది. చుట్టూ నివాస గృహాలు ఉన్నాయి. అది ఎప్పుడు కూలుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.
– న్యూస్‌టుడే, హిందూపురం అర్బన్

రూ.10 నాణేలు తీసుకోవడం లేదని ఆవేదన


నాణేలను చూపుతున్న రైతు క్రిష్టప్ప

సోమందేపల్లి, న్యూస్‌టుడే: స్థానిక వారపు సంతలో గురువారం రూ.10 నాణేలను వ్యాపారులు తీసుకోవడం లేదని కొత్తపల్లి రైతులు క్రిష్టప్ప, రామాంజనప్ప, మరికొందరు ఆందోళన వ్యక్తం చేశారు. నాణేలను తీసుకోవడానికి నిరాకరిస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్బీఐ ఆదేశించిందని సోమందేపల్లి కెనరాబ్యాంకు మేనేజర్-2 సురేశ్, తెదేపా నాయకులు, ఖాతాదారుల సమక్షంలో ఇటీవల తెలియజేశారు. అయితే పలువురు దుకాణాలదారులు, వ్యాపారులు నాణేలను తీసుకోవడం లేదని, నోట్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని క్రిష్టప్ప వాపోయారు. నాణేల చెలామణిపై విస్తృతంగా ప్రచారం చేపట్టనున్నట్లు బ్యాంకు మేనేజర్ గంగాధర్ తెలిపారు.

వర్షాలకు కూలిన ఇళ్లు


సోమందేపల్లి: కూలిన ఇంటి వద్ద రైతు హనుమంతు దంపతులు

సోమందేపల్లి: మండలంలోని సుద్దకుంటపల్లి గ్రామంలో తెదేపా కార్యకర్త హనుమంతుకు చెందిన ఇంటి పైకప్పు, గోడలు కూలిపోయాయి. వారం రోజులుగా కురిసిన భారీ వర్షాలకు మట్టి గోడలు దెబ్బతిని వెనుకభాగం, సగానికి పైగా పైకప్పు బుధవారం అర్ధరాత్రి ఒక్కసారిగా నేలకూలింది. బయట రేకుల షెడ్డులో నిద్రిస్తున్న హనుమంతు కుటుంబ సభ్యులు భయాందోళనకు గురై పరుగులు తీశారు. ఈఘటనలో ఆహార ధాన్యాలు, వంట సామగ్రి, దుస్తులు పాడైపోయి రూ.50 వేలు వరకు నష్టం వాటిల్లినట్లు బాధిత కుటుంబ సభ్యులు వాపోయారు.

పెనుకొండ: పట్టణంలోని బోయపేటకు చెందిన రామకృష్ణ ఇంటి పైకప్పు వర్షానికి కూలిపోయింది. దిక్కుతోచని స్థితిలో కుటుంబం తాత్కాలికంగా శ్రీకృష్ణ దేవాలయంలోని గదిలో ఉంటున్నారు. ప్రభుత్వం ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు.

క్రమశిక్షణ.. భవితకు రక్షణ

స్కౌట్స్‌లో ప్రతిభ చాటుతున్న విద్యార్థులు


అగ్ని ప్రమాదం జరిగినప్పుడు రక్షించే విధానాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు

లేపాక్షి, హిందూపురం, న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, సేవాభావం, దేశభక్తి పెంపొందించి ఉత్తమ పౌర సమాజం ఏర్పాటు కావాలనే లక్ష్యంతో ఏర్పాటైన స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థ శిక్షణలో శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు తమ ప్రతిభ చాటారు. లేపాక్షి మండలం పులమతిలో తృతీయ సోపాన్, రాజ్య పురస్కార్ టెస్టింగ్ క్యాంపు 5రోజుల పాటు జిల్లా కార్యదర్శి గిరిధర్ నేతృత్వంలో నిర్వహించారు. శిబిరంలో మొత్తం 163 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయులు సుబ్బారావు నేతృత్వంలో శిక్షకులు ప్రసాద్, నాగరాజు విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. గుడారాలు ఏర్పాటు చేయడం, అగ్ని ప్రమాదాలకు గురైన వారిని కాపాడటం, ప్రథమ చికిత్స చేయడం వంటి కృత్యాలను నేర్పించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థుల మనోభావాలు తెలుసుకుందాం...

స్వశక్తితో ఎదిగేలా..



ఎవరికి వారు తమ పనులు చేసుకోవడంతో పాటు స్వశక్తితో ఎలా ఎదగాలి అనే దానిపై వివరించారు. శిక్షణలో భాగంగా గుడారాలు వేసుకోవడం, వంట చేసుకోవడం, బృందాలుగా ఆడుకోవడం, శుభ్రత ఆవశ్యకత ఇలా అనేక అంశాలు నేర్చుకున్నాం. సామాజిక అంశాలపై అవగాహన కల్పించడంతో సమస్యను ధైర్యంగా ఎదుర్కోవాలనే విషయం అవగతమైంది.
- గుణశేఖర్, ఎనిమిదో తరగతి, రాచపల్లి, హిందూపురం

ఏకాగ్రత పెరిగింది



శిక్షణ తీసుకోవడం ద్వారా నాలో భయం పోయి ఏదైనా సాధించవచ్చన్న ఆత్మవిశ్వాసం ఏర్పడింది. సదా సమాజ సేవలో ఉంటాం అనేది మా నినాదం. దానికి తగ్గట్టుగానే స్వీయరక్షణ ఎలా పొందాలి, ప్రమాదాల సమయంలో ప్రథమ చికిత్స అందించే విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, రోజువారి జీవితంలో పాటించాల్సిన అంశాలను వివరించారు.
- సంపత్‌కుమార్, ఆరోతరగతి, చిలమత్తూరు

అన్ని అంశాలు నేర్పుతున్నారు



సత్యం మాట్లాడటం, కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవడం, అత్యవసర సమయాల్లో సాయం చేయడం ఇలా అన్ని అంశాల్లోనూ తర్ఫీదు ఇచ్చారు. సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం ఎంతో సంతృప్తిగా ఉంది. ఉన్నత చదువులతో పాటు మెరుగైన ఉపాధి పొందేందుకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుంది. మూడు దశలు పూర్తిచేసి గవర్నర్ పురస్కారం పొందడం సంతోషంగా ఉంది. ఇదే స్ఫూర్తితో రాష్ట్రపతి పురస్కారం పొందేందుకు శాయశక్తులా కృషి చేస్తా.
- విమల్, తొమ్మిదోతరగతి, చిన్మయా విద్యాలయ, హిందూపురం

దేవాలయంలో విద్యార్థుల శ్రమదానం

పెనుకొండ, న్యూస్‌టుడే: పట్టణంలోని శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి దేవాలయంలో గురువారం స్థానిక పీవీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్ఎస్ విద్యార్థులు శ్రమదానం నిర్వహించారు. ఆలయ ఆవరణలోని చెత్త, పిచ్చిమొక్కలు తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. విద్యార్థులను ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కేశవరావు, ఎన్‌ఎస్ఎస్ అధికారి జయప్ప తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా క్రికెట్ ఫైనల్ పోటీలు

సోమందేపల్లి, న్యూస్‌టుడే: స్థానిక స్నేహలతా నగర్ వద్ద మైదానంలో శుక్రవారం ఉదయం మెగా క్రికెట్ టోర్నమెంటు ఫైనల్స్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు, జనసేన మండల అధ్యక్షుడు జబీవుల్లా, బాబా తెలిపారు. ఈనెల 5వ తేదీ నుంచి ఇక్కడ మెగా క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఫైనల్స్ పోటీ స్థానిక ఆర్గనైజర్- ధలా ఎలెవెన్స్ జట్ల మధ్య జరుగనుందని, క్రికెట్ క్రీడాభిమానులు పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

ఆలయ కమిటీల్లో బ్రాహ్మణులకు చోటుపై హర్షం

కదిరి, న్యూస్‌టుడే: దేవాలయ పాలకమండలి కమిటీల్లో బ్రాహ్మణులకు అవకాశం కల్పించే నిర్ణయంపై ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివరాం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ప్రతి ఆలయ పాలక మండలిలో బ్రాహ్మణులకు చోటు కల్పించాలన్న నిర్ణయం మంచిదన్నారు. నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు.

క్రీడాకారులకు టీషర్టుల అందజేత

బుక్కపట్నం, న్యూస్‌టుడే: బుక్కపట్నంలోని శ్రీసత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పుట్టపర్తి మంగళకర డిగ్రీ కళాశాల వాలీబాల్ క్రీడాకారులకు తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ గురువారం టీషర్టులను పంపిణీ చేశారు. కళాశాల అధ్యాపకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పుట్టపర్తి

•పుట్టపర్తి •ధర్మవరం • కదిరి •రాప్తాడు

అప్రాచెరువులో గంగమ్మకు పూజలు

బత్తలపల్లి, న్యూస్‌టుడే: బత్తలపల్లి మండలం అప్రాచెరువు గ్రామ సమీపంలోని చెరువు నిండి మరువ పారడంతో గ్రామస్థులు గంగమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ చెరువు నిండిపోవడంతో 10 గ్రామాలకు నీరు సమృద్ధిగా ఉంటాయని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి శారదమ్మ, భాజపా మండల కన్వీనర్ ఆకులేటి వీరనారప్ప, వెంకటరాంగారెడ్డి ముసుగు రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.



చెరువు నిండి మరువ పారడంతో గంగమ్మకు పూజ చేస్తున్న గ్రామస్థులు

శిరస్త్రాణం రక్షణ కవచం

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనదారులు ప్రతి ఒక్కరూ విధిగా శిరస్త్రాణం ధరించాలని ఎస్సై సత్యనారాయణ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని న్యాయస్థల కూడలిలో వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలపై గురువారం చైతన్య కార్యక్రమం నిర్వహించారు. వాహనదారులు రోడ్డు భద్రత నియమాలను అనుసరించి వాహనాలు నడిపితే ప్రమాదాలను అరికట్టే ఆస్కారం ఉంటుందన్నారు.

తెదేపా బలోపేతానికే సభ్యత్వ నమోదు

ముదిగుబ్బ: ఈనెల 26వ తేదీ నుంచి తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెదేపా నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ముదిగుబ్బలోని తెదేపా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. సభ్యత్వ నమోదు చేయించుకుంటే కార్యకర్తలకు రూ. 5 లక్షల ప్రమాదబీమా, వారి కుటుంబ సభ్యుల విద్య, వైద్యం, ఉపాధి కోసం సాయం అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర రైతుసంఘం కార్యదర్శి రమేష్ బాబు, క్లస్టర్ ఇన్‌ఛార్జి తుమ్మల మనోహర్, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

గ్రామీణ విద్యార్థులు.. రాష్ట్రస్థాయిలో రాణింపు

వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్‌లో సత్తా

ముదిగుబ్బ, బత్తలపల్లి, న్యూస్‌టుడే: గ్రామీణ విద్యార్థులు ఆటల్లో సత్తా చాటుతున్నారు. వ్యాయామ ఉపాధ్యాయుల తర్ఫీదు, సూచనలతో రాష్ట్రస్థాయిలో రాణిస్తూ భవిష్యత్తులో జాతీయస్థాయిలో పతకాలు గెలిచేందుకు నిత్యం కఠోర సాధన చేస్తున్నారు. బత్తలపల్లి మండలంలోని రామాపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, ముదిగుబ్బ మండలంలోని బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్‌లో పోటీల్లో సత్తా చాటుతున్నారు. క్రీడల్లో రాణిస్తుండటంతో ప్రధానోపాధ్యాయులు వెంకటనాయుడు, రాఘవ, పీడీలు లక్ష్మీనారాయణ, రాజశేఖర్ వారిని అభినందించారు.



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

ఐపీఎస్ కావడమే లక్ష్యం



ముదిగుబ్బ జిల్లాపరిషత్తు బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాను. అమ్మానాన్న దస్తగిరి, నస్రీమ్. నాన్న బేల్దారి పనిచేస్తారు. చిన్నప్పట్నుంచి క్రీడలంటే బాగా ఇష్టం. ఆరో తరగతి చదివే సమయం నుంచి క్రీడల్లో వ్యాయామ ఉపాధ్యాయులతో శిక్షణ తీసుకుని మెలకువలు నేర్చుకున్నాను. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల అనంతపురంలో అండర్-17 విభాగంలో జరిగిన వాలీబాల్ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాను. ఈనెల 22వ తేదీ హిందూపురంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నాను. భవిష్యత్తులో ఐపీఎస్ కావడమే నా లక్ష్యం. **- మస్తాన్‌వలీ, ముదిగుబ్బ**

జాతీయస్థాయిలో ఆడాలనుంది

బత్తలపల్లి మండలం రామాపురం జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాను. అమ్మానాన్న లక్ష్మన్న, మల్లేశ్వరి కూలీ పనిచేస్తారు. క్రీడలపై ఉన్న మక్కువతో పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుల ద్వారా శిక్షణ తీసుకుని మరిన్ని మెలకువలు నేర్చుకున్నాను. ఇటీవల అనంతపురంలో బాల్ బ్యాడ్మింటన్ అండర్-18 విభాగంలో జరిగిన పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాను. ఈనెల 5వ తేదీ విశాఖపట్నంలో జరిగిన బాల్‌బ్యాడ్మింటన్‌లో పాల్గొని రాణించాను. జాతీయస్థాయిలో ఆడాలనుంది. **- చందన, రామాపురం**



వైద్యురాలినవుతా..

రామాపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాను. అమ్మానాన్న నారాయణస్వామి, శైలజ. నాన్న ఆటో నడుపుతాడు. తోటి విద్యార్థులు క్రీడల్లో రాణిస్తుండటంతో ఆటలపై ఇష్టం పెరిగింది. బాల్‌బ్యాడ్మింటన్ క్రీడలపై శిక్షణ తీసుకుని ఇటీవల అండర్-18 విభాగంలో అనంతపురం పాల్గొని రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాను. ఈనెల 5వ తేదీ విశాఖపట్నంలో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని రాణించాము. క్రీడల్లో రాణిస్తూనే ఉన్నతంగా చదువుకుని డాక్టర్ కావడమే లక్ష్యంగా పెట్టుకున్నాను. **- యశ్వంతి, రామాపురం**



మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

పుట్టపర్తి: 80085 73039, కదిరి: 80085 73033, ధర్మవరం: 99596 98222

సమస్య: బుక్కపట్నంలోని శివాలయం దగ్గర నుంచి సుందరయ్య కాలనీ వరకు మురుగు రోడ్డుపై పారుతూ దుర్గంధం వస్తోంది. **- రాజాంజనేయులు**

సమాధానం: ఆ ప్రాంతాన్ని పరిశీలించి శుభ్రం చేయిస్తాం. **- సాధిక్ పీరా, పంచాయతీ కార్యదర్శి**

సమస్య: బుక్కపట్నం శివార్లలోని నల్లమ్మ ఆలయం దగ్గర రోడ్డు మరమ్మతులకు గురై వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు.

సమాధానం: పరిశీలించి ఆర్‌అండ్‌బీ అధికారులకు తెలియజేసి సమస్య పరిష్కరిస్తాం. **- శ్రీనివాసులు, ఎంపీడీఓ**

సమస్య: పాముదుర్తి గ్రామ శివార్లలో ఇటీవల కురిసిన వర్షానికి రోడ్డు మరమ్మతులకు గురై వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు.

సమాధానం: పరిశీలించి రోడ్డు మరమ్మతులు చేయిస్తాం. **- నాగరాజు, పంచాయతీరాజ్ జేఈ** -న్యూస్‌టుడే, బుక్కపట్నం



బుక్కపట్నం: జానకంపల్లిలోని సత్యసాయి తాగునీటి ట్యాంకు పైకి ఎక్కడానికి ఇనుప నిచ్చెనకు తీగ అల్లేసుకుంది. దీనిపై ఈనెల 21న ఈనాడులో 'నిర్లక్ష్యం పైకి పాకింది' అనే శీర్షిక కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు తీగను తొలగించి ఆ ప్రాంతాన్ని శుభ్రపరిచారు.

మద్యం దుకాణం ఏర్పాటుపై వివాదం

తాడిమర్రి, న్యూస్‌టుడే: మద్యం దుకాణం ఏర్పాటు విషయం కూటమి నాయకుల మధ్య చిచ్చురేపింది. గురువారం తాడిమర్రిలోని మద్యం దుకాణాన్ని ప్రారంభించేందుకు భాజపా అసెంబ్లీ కన్వీనర్ గోపాల్‌రెడ్డి ప్రయత్నించారు. దీన్ని తెదేపా నాయకులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు చించివేశారు. పరిస్థితి ఉద్రిక్త మారుతుండటంతో కొందరు పోలీసులకు దుకాణం వద్దకు చేరుకున్నారు. బందోబస్తు నడుమ దుకాణం ప్రారంభించాలని ప్రయత్నించినా.. తెదేపా నాయకులు ససేమిరా అనడంతో ఘర్షణ వాతావర్ణం నెలకొంది. సమాచారం అందుకున్న డీఎస్పీ శ్రీనివాసులు, పలువురు సీఐలు, ఎస్సైలు, ప్రత్యేక బలగాలతో రంగ ప్రవేశం చేసి అందర్నీ చెదరగొట్టారు. ఇరువర్గాలతో మాట్లాడి పోలీసులు మద్యం దుకాణాన్ని తాత్కాలికంగా మూసివేయించారు. అనంతరం డీఎస్పీ ఇరువర్గాలతో మాట్లాడి కూర్చుని సమస్యను పరిష్కరించుకోవాలని వారికి సూచించారు.



మూతపడిన మద్యం దుకాణం

ఇదీ పరిస్థితి..

తెలంగాణకు చెందిన గణేష్ అనేవ్యక్తికి తాడిమర్రిలో మద్యం దుకాణం లాటరీలో తగిలింది. దీన్ని భాజపా నాయకుడు గోపాల్‌రెడ్డి, సురేష్‌రెడ్డి అతనితో పార్టనర్ షిప్‌తో మాట్లాడుకున్నారు. తాడిమర్రిలో దుకాణం వీరే నిర్వహించేలా ఒప్పందం చేసుకున్నారు. ఈ క్రమంలో దుకాణం ప్రారంభిస్తుండటంతో ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది.

మహిళా మార్ట్‌లో ఆడిట్

బత్తలపల్లి, న్యూస్‌టుడే: బత్తలపల్లిలోని తాడిపత్రి రోడ్డులో ఉన్న భారతి మహిళా మార్ట్ నష్టాల్లో నడుపుతున్నారన్న ఆరోపణల నేపథ్యంలో ఆడిట్ నిర్వహించారు. డబ్బులు, సరుకుల్లో వ్యత్యాసాలు లక్షల్లో ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో రెండురోజుల నుంచి సరుకుల బ్యాలెన్స్ షీట్‌ను ఆడిటర్లు పరిశీలిస్తున్నారు. ఈ విషయంపై ఏరియా కో-ఆర్డినేటర్ సత్యనారాయణతో మాట్లాడగా ఆడిట్ జరుగుతోందని, పూర్తయిన వెంటనే డబ్బులు, సరుకుల వ్యత్యాసాలను వెలువడిస్తామని తెలిపారు.

విద్యుత్తు స్తంభానికి చెట్ల తీగల తొలగింపు

బత్తలపల్లి, న్యూస్‌టుడే: వెంకటగారిపల్లి బస్టాండ్ సమీపంలో విద్యుత్తు స్తంభానికి చెట్ల తీగలు అల్లుకోవడంతో సరఫరాలో అంతరాయం జరుగుతోంది. గురువారం ఈనాడు 'దినపత్రిక పుట్టపర్తి జోన్‌లో ప్రచురితమైన 'అల్లుకున్న నిర్లక్ష్యం' చిత్రానికి విద్యుత్ అధికారులు స్పందించి వెంటనే స్తంభానికి ఉన్న చెట్ల తీగలను తొలగించారు.

హైవే నిర్మాణంలో కోల్పోయే భూముల పరిశీలన

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: మండలంలోని మలకవేముల క్రాస్ మీదుగా వెళ్లే గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంలో కోల్పోయే భూములను గురువారం ఆర్డీవో మహేష్ పరిశీలించారు. హైవే నిర్మాణంలో పెట్రోలుబంకు తొలగిపోతుందని కోర్టును ఆశ్రయించిన బాధితుడితో మాట్లాడారు. అనంతరం ముదిగుబ్బ నుంచి పుట్టపర్తికి వెళ్లే 342వ జాతీయ రహదారి విస్తరణలో కోల్పోయే భూములు పరిశీలించారు. రామస్వామితండా దగ్గర శ్మశానవాటిక విస్తరణలో సగభాగం కోల్పోతుండగా మరొక ప్రాంతంలో శ్మశానవాటిక కోసం స్థలం కేటాయిస్తామని గ్రామస్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆదినారాయణయాదవ్, తహసీల్దార్ నారాయణస్వామి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



రామస్వామితండా గ్రామస్థులతో మాట్లాడుతున్న ఆర్డీవో మహేష్

రాకపోకలు లేకుండా రైల్వేమోరీ మూయొద్దు

నల్లచెరువు (కదిరి), న్యూస్‌టుడే: మండలంలోని సంజీవపల్లికి సమీపంలోని రైల్వే మోరీ మూయకుండా రాకపోకలకు సదుపాయం కల్పించాలంటూ తహసీల్దార్‌కు గురువారం సర్పంచి హర్షవర్ధన్‌నాయుడు, గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు. మోరీ వద్దకు వచ్చిన అధికారులతో గ్రామస్థులు తమ పరిస్థితి వివరించారు. రైతులను పరిస్థితి అర్థం చేసుకుని రాకపోకలకు ఇబ్బందుల్లేకుండా దారి బాగుచేసి సదుపాయం కల్పించాలని తహసీల్దార్ రవి కుమార్, ఎస్సై మక్బూల్‌బాషాలకు వినతిపత్రాలను అందజేశారు. పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని వారు తెలిపారు.

భూ సమస్యల పరిష్కారానికి నేడు ప్రజా దర్బార్

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నేడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు తెదేపా మండల కన్వీనర్ ముత్యాలరెడ్డి పేర్కొన్నారు. అపరిష్కృతంగా ఉన్న న్యాయపర, రెవెన్యూ సమస్యలు, దీర్ఘకాలంగా ఉన్న ఇతర భూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సమావేశం ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమస్యలు ఉన్న రైతులు సంబంధిత ధ్రువపత్రాలతో ఉదయం 10 గంటకు ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకోవాలన్నారు. ఆర్డీఓ మహేష్, స్థానిక రెవెన్యూ అధికారులు సమావేశానికి హాజరవుతారన్నారు.

తెదేపా కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: మండలంలోని బ్రహ్మదేవరమర్రి గ్రామంలో ఇటీవల తెదేపా కార్యకర్త తిరుపాలు అనారోగ్యంతో మృతిచెందడంతో విషయం తెలుసుకున్న తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ వారి కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు. గురువారం అనంతపురంలోని శ్రీరామ్ ఇంటి దగ్గర తిరుపాలు కుమారులకు రూ. 50 వేలు అందించారు. వాల్మీకి బాలచంద్ర, బాలకృష్ణ పాల్గొన్నారు.

శతజయంత్యుత్సవాలు విజయవంతం చేయండి

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: ముదిగుబ్బలో ఈనెల 27వ తేదీ రాష్ట్రీయ స్వయం సేవక సంఘ్ ఆధ్వర్యంలో నిర్వహించే శత జయంత్యుత్సవాల్లో హిందువులంతా పాల్గొని విజయవంతం చేయాలని భాజపా రాష్ట్ర కమిటీ సభ్యులు తెలిపారు.

నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోండి

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల యజమానులు మౌలిక వసతులు కల్పించకుండా విద్యార్థులకు నరకం చూపిస్తున్నారని పీఎస్‌యూ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరేంద్ర ఆరోపించారు. ప్రైవేట్ విద్యా సంస్థల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం రెవెన్యూ శాఖ ఏవో హంపయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో 35 ప్రైవేట్ పాఠశాలలున్నాయని, వాటిలో జరుగుతున్న అక్రమాలను విద్యాశాఖాధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని తెలిపారు.

రైఫిల్ షూటింగ్‌లో ప్రతిభ

కనగానపల్లి: రైఫిల్ షూటింగ్‌లో ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థి రాష్ట్ర స్థాయిలో రాణించినట్లు హెచ్‌ఎం రవికిరణ్, పీఈటీ మాదవ పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఆదర్శపాఠశాలలో పదవ తరగతిలో విద్యాభ్యాసం సాగిస్తున్న విద్యార్థి నాగయశ్వంత్‌ను అభినందించారు. ఈ నెల 21న రాజమండ్రిలో నిర్వహించిన అండర్ 17 ఎస్‌జీఎఫ్ రైఫిల్ షూటింగ్‌లో మంచి ప్రతిభను కనపర్చి 150కి 77 పాయింట్లు సాధించడంతో రాష్ట్ర స్థాయిలో 5 స్థానంలో నిలిచాడన్నారు .





వ్యాసరచనతో విషయ పరిజ్ఞానం

'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీలు

కదిరి, న్యూస్‌టుడే: వ్యాసరచన పోటీలతో విషయ పరిజ్ఞానానికి దోహదపడుతుందని ప్రధానోపాధ్యాయుడు లియాఖత్ అలి తెలిపారు. కదిరి పట్టణంలోని వేమన ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవపోటీలు జరిగాయి. ఇందులో 'ఇంటర్ వినియోగంతో లాభనష్టాలు- విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశం వ్యాసరచన పోటీలు జరిగాయి. విషయ పరిజ్ఞానంలో లోతైన అవగాహనతోనే పోటీలలో ప్రతిభను చాటగలరని ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. విజేతలైన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడి చేతులమీదుగా బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు కృష్ణమూర్తి రాజు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పోటీలతో నైపుణ్యాల పెంపు

ధర్మవరం, న్యూస్‌టుడే: వ్యాసరచన పోటీలతో నైపుణ్యాలు పెంచుకోవచ్చని మహర్షి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొండారెడ్డి అన్నారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని మహర్షి ఉన్నత పాఠశాలలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు - విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు జరిగాయి. విద్యార్థులు తమలోని ప్రతిభను ఆవిష్కరించారు. పోటీల్లో ఎం.వరుణ్ సందేశ్ (9వ తరగతి), ఎస్.సౌజాన్ (10వ తరగతి), ఆర్.మేఘన (8వ తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ప్రధానోపాధ్యాయుడు కొండారెడ్డి వారికి బహుమతులు, ధ్రువపత్రాలు అందజేశారు. ఉపాధ్యాయుడు చెన్నకేశవులు, అమ్మాజాన్, చంద్రిక పాల్గొన్నారు.





రహదారి నిర్మాణ పనుల పరిశీలన

కదిరి గ్రామీణం, న్యూస్‌టుడే: కదిరి మండలం కదిరి కుంట్లపల్లి గ్రామంలో ప్రధాన కూడలి నుంచి ఎస్సీ కాలనీ వరకు రూ. 20 లక్షల ఉపాధి హామీ నిధులతో నిర్మిస్తున్న సీసీ రహదారి నిర్మాణ పనులను గురువారం ఎంపీడీవో పోలప్ప, పంచాయతీ రాజ్ శాఖ ఏఈ గుప్తా, ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రహదారి నిర్మాణ పనులు అనుకున్న సమయానికి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎంపీడీవో అధికారులకు సూచించారు. రహదారి నిర్మాణానికి అడ్డుగా ఉన్న చెట్ల తొలగించడాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామ్మోహన్, ఉపాధి హామి సిబ్బంది పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఉద్యోగాలకు మౌఖిక పరీక్షలు

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే: పుట్టపర్తిలోని ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం పలు ఉద్యోగాలకు మౌఖిక పరీక్షలు నిర్వహించారు. ధర్మవరం, హిందూపురంలలో బాల సదన్‌లో ఖాళీగా వున్న స్టోర్‌కీపర్, కుక్, హౌస్ కీపర్, ఎడ్యుకేటర్, ఆర్ట్, క్రాఫ్ట్ టీచర్, నైటు వాచ్‌మాన్ పోస్టులకు గతంలో నోటిఫికేసన్ వెలువడగా అభ్యర్థులకు ఇటీవల పరీక్షలు నిర్వహించారు. అందులో ప్రతిభ కనబరిచిన అభ్యర్థులకు జేసీ అభిషేక్ కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగ ప్రసాద్, ఐసీడీఎస్ పీడీ నాగమల్లేశ్వరి ఆధ్వర్యంలో మౌఖిక పరీక్షలు నిర్వహించారు.

విజయోత్సవ ర్యాలీకి తరలిరండి

కదిరి, న్యూస్‌టుడే: అనంతపురంలో నవంబరు 5న జరిగే ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ ర్యాలీకి తరలి రావాలని ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. కదిరిలోని రోడ్లు భవనాల అతిథి భవనంలో గురువారం సమావేశమయ్యారు. నవంబరు ఒకటి నుంచి 5వరకు జరిగే ఉమ్మడి జిల్లాల సదస్సుల్లో మందకృష్ణ మాదిగ పాల్గొంటారన్నారు. ఇందులో భాగంగా ఐదున అనంతపురం సదస్సుకు వస్తారన్నారు. మందకృష్ణ మాదిగ వస్తున్న సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి జాతిమొత్తం పెద్ద ఎత్తున విజయోత్సవ ర్యాలీలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిర్చారు. సమావేశంలో ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగేంద్రనాథ్, నాగరాజు, ఆంజనేయులు, రామకృష్ణ, కిష్టప్ప, ఎంజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు యల్లంరాజు, గంగాద్రి, రామచంద్ర, శివన్న, తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే ఆన్‌లైన్ మోసాలు దూరం

కదిరి, న్యూస్‌టుడే: ఆన్‌లైన్‌లో జరిగే మోసాలకు గువరకుండా నిరోధించటంలో యువత కీలక పాత్ర పోషించాలని అర్బన్ సీఐ నారాయణ రెడ్డి తెలిపారు. పోలీసు సంస్మరణ వారోత్సవాల సందర్భంగా గురువారం ప్రభుత్వ డిగ్రీకళాశాలలో విద్యార్థులకు సైబర్‌నేర నియంత్రణలో యువత పాత్ర అంశంపై వ్యాస రచనపోటీలను నిర్వహించారు. పోటీల్లో ఉత్తమ ప్రదర్శించిన విద్యార్థులకు నగదు బహుమతులను ప్రధానం చేశారు. ఇందులో ప్రథమ బహుమతి రూ. 3 వేలు, ద్వితీయ రూ. 2 వేలు, తృతీయ బహుమతిగా రూ. వెయ్యిలను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ స్మిత, ఎస్ఐ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.




వ్యాసరచనలో విద్యార్థులు, పర్యవేక్షిస్తున్న సీఐ నారాయణరెడ్డి, ప్రిన్సిపల్ స్మితలు

అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీల వితరణ

తనకల్లు: మండలంలోని చీకటిమానిపల్లి అంగన్‌వాడీ కేంద్రానికి గ్రామీణ కుంట సంస్థ ఆధ్వర్యంలో పరికరాలు గురువారం అందజేశారు. 30 పిల్లల కుర్చీలు, 4 పెద్ద కుర్చీలు, 2 దుప్పట్లు అందజేశారు. అనంతరం సంస్థ మేనేజరు జగదీష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కేంద్రాలను గుర్తించి పిల్లలకు పరికరాలు అందిస్తూ చిన్నతనం నుంచే వారిలో మంచి భావాలు తీసుకొచ్చేలా అవగాహన కల్పిస్తూ సౌకర్యాలు అందిస్తున్నామని అన్నారు. వారికి ఐసీడీఎస్ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీడీపీఓ గంగరత్నమ్మ, సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

బెదిరిస్తున్న సీఐపై చర్యలు తీసుకోవాలి

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: కేసు ఉపసంహరించుకోవాలని తన అనుచరులతో బెదిరిస్తున్న సీఐ మధుపై చర్యలు తీసుకోవాలని కదిరి మండలం యర్రదొడ్డికి చెందిన రామకృష్ణ ఎస్పీని కోరారు. గురువారం రామకృష్ణ ఆయన కుటుంబ సభ్యులు ఎస్పీని కలిసి వినతిపత్రం అందచేసినట్లు తెలిపారు. రామకృష్ణ కుమారుడు ఉదయ్‌కుమార్ గతనెల 27న ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రేమ వ్యవహారంలో అప్పటి కదిరి సీఐ మధు, తెలంగాణ సిద్ధిపేట సీఐ శ్రీనివాస్‌లు వేధింపులపై ఉదయ్‌కుమార్ న్యాయస్థానాన్ని ఆశ్రయించి కేసు పెట్టారు. ఈ కేసును వెనక్కితీసుకోవాలని మానసికంగా వేధించడంతో ఉదయ్ బలవన్మరణం చేసుకున్నాడని ఆరోపించారు. బిడ్డను పోగొట్టుకున్న బాధలో ఉన్న తమ ఇంటికి మనుషులను పంపిణీ కేసును వెనక్కి తీసుకోవాలని బెదిరిస్తున్నారని రామకృష్ణ, ఆయన కుటుంబ సభ్యులు శ్రీనాథ్, కేశవయ్య ఎస్పీకి వివరించినట్లు బాధితులు తెలిపారు.



ప్రమాదకరంగా విద్యుత్తు తీగలు

కదిరి గ్రామీణం, న్యూస్‌టుడే: కదిరి మండలం జౌకల గ్రామంలో విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. గ్రామంలోని విద్యుత్తు నియంత్రిక సమీపంలో ఉన్న తీగలను చెట్ల కొమ్మలు కప్పి వేశాయి. భారీ వర్షాలు, అధిక గాలులకు కొమ్మలు ఊగినప్పుడు తీగలు తెగిపోవడం, స్తంభాలు కూలిపోయే ప్రమాదం ఉంది. చెట్ల కొమ్మలు తొలగించి ప్రమాదాలు జరగకుండా విద్యుత్తు శాఖ సిబ్బంది ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయాన్ని కదిరి మండల విద్యుత్తు శాఖ ఏఈ గౌరీ శంకర్ దృష్టికి తీసుకెళ్లగా సిబ్బందిని పంపి చెట్ల కొమ్మలు తొలగించి, ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పట్టు జారితే ప్రమాదమే..

కొత్తచెరువు, న్యూస్‌టుడే: కొత్తచెరువు మండల పరిధిలోని గ్రామాల నుంచి ఉన్నత పాఠశాలలకు చేరుకోవడానికి విద్యార్థులు ఆటోల్లో ప్రమాదకరంగా ప్రయాణం సాగిస్తున్నారు. ఇరగంపల్లి, వంగంపల్లి, నాగిరెడ్డిపల్లి గ్రామాల నుంచి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలకు విద్యార్థులు చేరుకోవడానికి బస్సు సౌకర్యం లేదు. దీంతో విద్యార్థులు సకాలంలో పాఠశాలకు చేరుకోవాలంటే ఆటోలే దిక్కు. దీంతో సామర్థ్యానికి మించి ప్రయాణికులను తరలిస్తున్న ఆటోల్లో విద్యార్థులు వేలాడుతూ నిత్యం ప్రయాణిస్తున్నారు. ఆటో వేగంగా వెళ్లినా, రోడ్డు మలుపులు, గుంతల్లో ఏమాత్రం పట్టు జారినా విద్యార్థులు ప్రమాదానికి గురికాక తప్పదు. రోడ్డు సౌకర్యం ఉన్న గ్రామాలకు ఆర్టీసీ బస్సులను నడిపి ప్రమాదాలను నివారించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.





మలుపులు.. కానరాని సూచిక బోర్డులు

బత్తలపల్లి న్యూస్‌టుడే: బత్తలపల్లి మండలం మాల్యవంతం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలోని మలుపు వద్ద సూచిక బోర్డులు లేక వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ మలుపు వద్ద గతంలో ఆర్టీసీ బస్సు, లారీ ఢీకొన్న ప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు.. ద్విచక్ర వాహనాలు ఢీకొని పలువురికి కాళ్లు, చేతులు విరిగాయి. కారు గుంతలో పడి నలుగురు గాయపడ్డారు. ఆటో కిందపడి ఒకరు మృతి చెందారు. ఈ మలుపు వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా నివారించాలని గ్రామస్థులు, వాహనదారులు కోరుతున్నారు.

స్థల వివాదంలో ఇరువర్గాల ఘర్షణ

ధర్మవరం, బత్తలపల్లి: పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురం వద్ద ప్లంబర్స్ అండ్ ఎలక్ట్రికల్స్ కాలనీలో గురువారం రాత్రి అసోసియేషన్ నాయకులు, భాజపా నాయకుడు డోలా రాజారెడ్డికి మధ్య వాగ్వాదం జరిగింది. ప్రధాన రహదారి పక్కన అసోసియేషన్ కార్యాలయం ఉంది. ఆ పక్కనే రాజారెడ్డికి చెందిన స్థలం ఉంది. స్థలం చదును చేయిస్తున్న దశలో అసోసియేషన్ కార్యాలయం తొలగింపు యత్నానికి దిగుతున్నాడని నాయకులు సురేంద్ర, రాజు, తదితరులు రాజారెడ్డిని ప్రశ్నించారు. దీంతో గొడవకు దారి తీసింది. రెండో పట్టణ సీఐ రెడ్డెప్ప, పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లారు. అక్కడి నుంచి ఇరువర్గాలను పంపించేశారు.

పెళ్లి పేరుతో మోసం

కదిరి పట్టణం: నల్లచెరువు మండలం గాజేఖాన్‌పల్లికి చెందిన ప్రతాప్‌కుమార్ మండలానికి చెందిన యువతిని పెళ్లిచేసుకుంటానంటూ నమ్మించాడు. రెండేళ్లుగా ఒక్కటయ్యారు. పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి తేవడంతో యువకుడి కుటుంబసభ్యులు తనపై దాడిచేసి గాయపరిచినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నిందితుడు ప్రతాప్‌కుమార్, ఆయన తండ్రి శ్రీనివాసులుతో పాటు మరో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు నల్లచెరువు పోలీసులు వివరించారు.